నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శనివారం | అక్టోబర్ 26, 2024 | www.navatelangana.com

డీఈఓ పాఠశాలల తనిఖీ

నవతెలంగాణ-బజార్‌హత్నూర్

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో పాటు కస్తూర్బా గాంధీ, పలు ప్రభుత్వ పాఠశాలలను శుక్రవారం డీఈఓ ప్రణీత ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా పాఠశాలలోని రికార్డులను విద్యార్థి హాజరు శాతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. పాఠశాలలో సమస్యలను ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.



ఐడీఈఓ ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను శుక్రవారం జిల్లా ఇంటర్ విద్యాధికారి రవీంద్ర కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాలలోని ప్రతి క్లాస్ రూమును పరిశీలించి అధ్యాపకుల బోధన తీరును పరిశీలించారు, విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధ్యాపకులతో సమావేశం ఏర్పాటు చేసి వార్షిక పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధులను చేయాలని, విద్యార్థుల రోజువారి హాజరును మెరుగుపరచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షబానా తరాన్నుమ్, అధ్యాపకులు పాల్గొన్నారు.



రైతుకు దక్కని మద్దతు

- పత్తి కొనుగోళ్లలో తొలిరోజే ప్రతిష్టంభన
- ప్రభుత్వ ధర కంటే తక్కువగా నిర్ణయించిన వ్యాపారులు
- తేమ అధికంగా చూపించడంతో కొనుగోలుకు సీసీఐ నిరాకరణ
- తేమతో సంబంధం లేకుండా కొనుగోలు చేయాలని రైతుల పట్టు
- ముందుకురాని వ్యాపారులు.. అన్నదాతల నిరసన
- కలెక్టర్ వాహనం అడ్డగింత..పంజాబ్ చౌక్‌లో రాస్తారోకో

మార్కెట్‌లో పత్తి రైతుకు మద్దతు ధర దక్కలేదు. అనేక ఆశలతో పంటను విక్రయిద్దామని మార్కెట్‌కు వచ్చిన అన్నదాతలకు అగచాట్లు తప్పలేదు. తేమ అధికంగా చూపించడంతో భారత పత్తి సంస్థ(సీసీఐ) కొనుగోలుకు నిరాకరించడం.. వ్యాపారులు సీసీఐ కంటే తక్కువ ధర నిర్ణయించడం.. తేమపై పేచీ కారణంగా తొలి రోజే కొనుగోళ్ల పర్వంలో ప్రతిష్టంభన నెలకొంది. ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెగని ఉత్కంఠకు దారితీసింది. కొనుగోళ్లను అధికారికంగా ప్రారంభించినా.. పత్తి విక్రయాలు మాత్రం జరగలేదు. తేమ అధికంగా చూపించడంతో కొనుగోలుకు సీసీఐ సంస్థ నిరాకరించడం.. ధర పెంచేందుకు వ్యాపారులు అంగీకరించకపోవడం.. తేమతో సంబంధం లేకుండా కొనుగోలు చేయాలని రైతులు పట్టుబట్టడం..వంటి పరిణామాలు మార్కెట్‌లో ఆందోళనకు దారితీశాయి. శుక్రవారం ఉదయం 10గంటలకు అధికారికంగా వేలం పాట ద్వారా పత్తి కొనుగోళ్లను ప్రారంభించగా.. రైతుల నిరసనలతో రాత్రి వరకు పత్తి విక్రయాలు మాత్రం మొదలుకాలేదు.



కలెక్టర్, అదనపు కలెక్టర్ సమక్షంలో వేలం పాట




పంజాబ్ చౌక్‌లో రైతుల రాస్తారోకో

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఆదిలాబాద్‌టౌన్

జిల్లా అధికారులు ఉదయం 10గంటలకు మార్కెట్‌లో పత్తి కొనుగోళ్లకు ముహూర్తం నిర్ణయించారు. జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆధ్వర్యంలో రైతులు, వ్యాపారులు, అధికారుల ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్ల వేలం పాట ప్రారంభించారు. సీసీఐ మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7521గా నిర్ణయించింది. వేలం పాట తొలుత రూ.6900 నుంచి ప్రారంభమై ఊగిసలాటల మధ్య క్వింటాల్‌కు రూ.7150వద్ద ఆగిపోయింది. సీసీఐ కంటే వ్యాపారులు ధర తక్కువగా నిర్ణయంతో రైతులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అయినప్పటికీ అధికారులు వెంటనే పత్తి కొనుగోళ్లను ప్రారంభించారు. మార్కెట్‌లో కాంటాల వద్ద పూజలు చేసి కొనుగోళ్లను మొదలుపెట్టారు. ఓ పత్తి ట్రాక్టర్‌లో తేమను నాలుగు వైపులా పరిశీలించగా.. ఏకంగా ఒక్కో భాగంలో ఒక్కో రీతిలో చూపించింది. అధికంగా 50శాతం చూపించడంతో సీసీఐ అధికారులు కొనుగోలుకు నిరాకరించారు. 8 నుంచి 12శాతం మధ్యలో ఉంటే కొనుగోలు చేయాలనే నిబంధనలు ఉన్నాయని అధికారులు చెప్పడం సందిగ్ధం నెలకొంది. ఇక ప్రయివేటు వ్యాపారులు క్వింటాల్‌కు రూ.7150 మాత్రమే ధర నిర్ణయించడం.. వీరికి విక్రయిస్తే 8శాతం పైన తేమ ఉంటే కిలోకు రూ.71చొప్పున కోత విధించే అవకాశం ఉండటంతో భారీగా నష్టపోతామనే ఉద్దేశంతో రైతులు పత్తిని విక్రయించలేదు. రెండు రోజుల క్రితమే వర్షాలు కురిశాయని..వాతావరణంలో సహజంగానే తేమ ఉంటుందని తేమతో సంబంధం లేకుండా కొనుగోళ్లు చేపట్టాలని రైతులు డిమాండ్ చేశారు. ఇందుకు వ్యాపారులు అంగీకరించకపోవడంతో ప్రతిష్టంభనకు దారితీసింది. మార్కెట్‌కు పెద్ద ఎత్తున వచ్చిన రైతులు అక్కడే కాంటాల వద్ద నిరసన చేపట్టారు. ఓ దశలో కలెక్టర్ వాహనాన్ని అడ్డగించి నిరసన చేపట్టారు.దీంతో కలెక్టర్ వ్యాపారులతో పలుమార్లు చర్చలు జరిపినప్పటికీ ఫలించలేదు.

రాస్తారోకోతో నిరసన

ఉదయం నుంచి మార్కెట్‌లోనే తేమతో సంబంధం లేకుండా కొనుగోళ్లు చేపట్టాలని నిరసన తెలపడంతో కొనుగోళ్లు మొదలుకాలేదు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వందలాది పత్తి వాహనాలు మార్కెట్‌లోనే నిలిచిపోయాయి. వ్యాపారులు అంగీకరించకపోవడం.. అధికారులు ఎటూ తేల్చకపోవడంతో వందలాది మంది రైతులు మార్కెట్ నుంచి బయలుదేరి స్థానిక పంజాబ్‌చౌక్‌కు చేరుకున్నారు. అక్కడి ప్రధాన రహదారిపై రాస్తారోకోతో ఆందోళన చేపట్టారు. కలెక్టర్ వచ్చి సమస్య పరిష్కరించే వరకు ఇక్కడ్నుంచి కదిలేదని స్పష్టం చేయడంతో పోలీసులు మిన్నకుండిపోయాయి. వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోవడంతో ట్రాఫిక్ జాం ఏర్పడింది. రాత్రి 7గంటల వరకు కూడా రైతుల ఆందోళన కొనసాగింది. అనేక మంది రైతులు మార్కెట్‌లోనే పడిగాపులు కాశారు. చివరకు రాత్రి 8.30గంటల సమయంలో కలెక్టర్ వ్యాపారులతో చర్చలు జరపగా తేమతో సంబంధం లేకుండా కమీషన్ మినహాయించి క్వింటాల్‌కు రూ.6700 చొప్పున కొనుగోలు చేసేందుకు అంగీకరించారు. దీంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో రైతులు విక్రయించేందుకు సిద్ధమయ్యారు. రైతులకు మార్కెట్ సిబ్బంది టోకెన్లు పంపిణీ చేయగా, శనివారం నుండి కొనుగోళ్లు ప్రారంభం కానున్నాయని అధికారులు తెలిపారు.



తూకానికి సిద్ధంగా ఉన్న పత్తి వాహనాలు



ఆందోళన విరమించాలని రైతులను కోరుతున్న పోలీసు అధికారులు

28, 29 తేదీల్లో సీపీఐ(ఎం) జిల్లా మహాసభలు



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ఈ నెల 28 29 తేదీలలో జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో సంఘ భవనంలో జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నామని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్‌కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా మూడవ మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహాసభలకు ముఖ్య అతిథిగా పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు జ్యోతి, రాష్ట్ర కమిటీ సభ్యులు అడివయ్య హాజరవుతారని తెలిపారు. 28న మధ్యాహ్నం 12గంటలకు మినీ ట్యాంక్ బండ్‌పై గల అంబేద్కర్ విగ్రహం నుంచి ర్యాలీ ప్రారంభమై టీఎన్జీవోస్ సంఘ భవనం వరకు కొనసాగుతుందన్నారు. 29న ప్రతినిధుల సభ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొమ్మెన సురేష్, జిల్లా కమిటీ సభ్యులు డాకూర్ తిరుపతి, నాయకులు పోశెట్టి పాల్గొన్నారు.

అఖిల భారత పశుగణన పకడ్బందీగా నిర్వహించాలి



నవతెలంగాణ-నస్పూర్

21వ అఖిల భారత పశుగణన-తెలంగాణ కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా పశువైద్య-పశు సంవర్ధక శాఖ అధికారి ఈర్ల శంకర్, మండలాల పశు వైద్యాధికారులతో కలిసి పశుగణన కార్యక్రమ వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 21వ అఖిలభారత పశుగణన-తెలంగాణ సర్వే కార్యక్రమం జిల్లాలో ఫిబ్రవరి 28, 2025 వరకు కొనసాగుతుందన్నారు. ఆవులు, గేదెలు, గొర్రెలు, కోళ్లు, మేకలు ఇతర జంతువుల సమాచారాన్ని డిజిటల్ పద్ధతిలో మొబైల్ అనువర్తనం ద్వారా నిక్షిప్తం చేస్తామన్నారు. రెవెన్యూ గ్రామాన్ని ప్రాతిపదికగా తీసుకొని జిల్లాలోని గ్రామపంచాయతీ, వార్డులలో పశుగణన చేసేందుకు 127 మంది ఎన్యుమరేటర్లను నియమించి తగిన శిక్షణ ఇచ్చామన్నారు. అన్ని మండలాల్లో పశు వైద్యాధికారుల పర్యవేక్షణలో పశు గణన, డిజిటల్ అనువర్తనం ద్వారా పశువుల సమాచారాన్ని నిక్షిప్తం చేస్తామని, ఎలాంటి పొరపాట్లు లేకుండా సర్వే నిర్వహించాలని తెలిపారు.

ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కల్గి ఉండాలి



నవతెలంగాణ-భైంసా

ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కల్గి ఉండాలని, చిన్నారులు ప్రతి విషయాన్ని తెలుసుకోవాలని ఏఎస్పీ అవినాష్ కుమార్ అన్నారు. రూరల్ పోలీస్‌స్టేషన్‌లో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాల్లో భాగంగా ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చిన్నారులు పోలీస్‌స్టేషన్ గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అందులో భాగంగానే ఓపెన్ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. పోలీస్‌స్టేషన్ విధులు, బాధ్యతలు, డయల్ 100 తదితర అంశాలను వివరించారు. ఆయుధాలు ఏకే 47, గన్, మెటల్ డిటెక్టర్ ఎలా వాడుతారో తెలిపారు. కార్యక్రమంలో రూరల్ సీఐ నైలు, ఎస్‌ఐ శ్రీనివాస్ యాదవ్, కస్తూరిబా పాఠశాల ప్రిన్సిపల్ అప్పాల జ్యోతి, విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగులకు సన్మానం

నవతెలంగాణ-తాంసి

భీంపూర్ మండలంలో చాలా కాలంగా ఏఈగా శ్రావణ్ కుమార్, సబ్ ఇంజనీర్‌గా సాయితేజ, లైన్ ఇన్‌స్పెక్టర్‌గా వసంత్ విధులు నిర్వర్తిస్తూ బదిలీ కావడంతో వారితో పాటు నూతనంగా బదిలీపై వచ్చిన ఏఈ తిరుపతిరెడ్డితో పాటు సిబ్బందిని శుక్రవారం తోటి సిబ్బంది శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా బాధ్యతలు చేపట్టిన అధికారులు మండల విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ సమస్య లేకుండా సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

క్యాడెట్లకు ముగిసిన డ్రిల్ శిక్షణ తరగతులు

ఆదిలాబాద్‌టౌన్ : పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాలలో 32 తెలంగాణ ఎన్సీసి బెటాలియన్ పది రోజుల పాటు నిర్వహించిన ఇనిస్టిట్యూషనల్ ట్రైనింగ్ శుక్రవారంతో ముగిశాయి. క్యాడెట్లకు నిర్వహించిన డ్రిల్ శిక్షణ తరగతులు పూర్తయినట్లు ఎన్సీసి పీఐ సిబ్బంది సుర్జిత్‌సింగ్, నరేష్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అతిక్ బేగం, శ్రీనివాస్, క్యాడెట్లు పాల్గొన్నారు.

28న బీసీ కమిషన్ సభకు బీసీలు తరలి రావాలి

ఉట్నూర్ : జిల్లాలోని బీసీ కులస్తులు 28న జిల్లా కేంద్రానికి వస్తున్న బీసీ కమిషన్ సమావేశానికి అధిక సంఖ్యలో తరలిరావాలని డివిజన్ ప్రతినిధులు వెంకటేష్, కాల్వ రవి, మరపాక రాజన్న, సీపతి రాజాగౌడ్ కోరారు. శుక్రవారం స్థానికంగా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం బీసీ కులాల జనాభా గణన కోసం కసరత్తు ప్రారంభించిందని, బీసీల జనాభాను తెలుసుకోవడానికి, బీసీల సమస్యల పరిష్కారం కోసం కమిషన్ చైర్మన్ నిరంజన్, సభ్యులు హాజరవుతున్నారని పేర్కొన్నారు.

నవంబర్ 8,9 తేదీల్లో సీపీఐ(ఎం) జిల్లా మహాసభలు

- హాజరుకానున్న రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



నవతెలంగాణ-మంచిర్యాల

నవంబర్ 8,9 తేదీల్లో సీపీఐ(ఎం) జిల్లా 3వ మహాసభలు నిర్వహిస్తున్నామని, దీనికి ముఖ్య అతిథిగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర నాయకులు భూపాల్ హాజరవుతారని రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో పార్టీ జిల్లా నాయకుడు గోమాస ప్రకాష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సీపీఐ(ఎం) రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా సమస్యలపై సమరశీల పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. జిల్లాలో ఆదివాసీ గిరిజన, పేదల సమస్యలపై పోరాడుతోందని తెలిపారు. ముఖ్యంగా ఇండ్ల స్థలాలు, వరద ముంపు, కాళేశ్వరం బ్యాక్ వాటర్‌తో పంటలు ముంపుకు గురవుతున్న బాధిత రైతుల పక్షాన పోరాడామని తెలిపారు. జిల్లా కేంద్రంలో రోడ్డు నిర్మాణం కోసం ధర్నాలు, జోడువాగుల బ్రిడ్జి నిర్మాణానికి పాదయాత్ర, జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులలో అన్ని రకాల డాక్టర్సను అందుబాటులో ఉంచి పేదలకు వైద్యం అందించాలని పోరాటం చేశామన్నారు. అసంఘటితరంగా కార్మికులు, సింగరేణి కాంట్రాక్టు, పర్మినెంట్ ఉద్యోగ, కార్మికులు, స్కీం వర్కర్ల సమస్యల పరిష్కరానికి అనేక పోరాటాలు నిర్వహించామని పేర్కొన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక ప్రవేటీకరణ విధానాలను గత ప్రభుత్వాల కంటే వేగంగా అమలు చేస్తోందన్నారు. పెట్రో, గ్యాస్‌తో పాటు నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి దాదాపు 9నెలలు కావస్తున్నా ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని తెలిపారు. ప్రతి రైతుకూ రుణమాఫీ చేస్తామనే హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మందమర్రి పట్టణంలో జరిగే జిల్లా మహాసభలకు జిల్లా ప్రజానీకం, మేధావులు, యువత అందరూ సహకరించాలని కోరరు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య, జిల్లా కార్యదర్శి సంకె రవి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దాసరి రాజేశ్వరి, కనికరపు అశోక్, జిల్లా కమిటీ సభ్యులు దుంపల రంజిత్ కుమార్, బోడెంకి చందు, గోమాస అశోక్, దాగం రాజారాం పాల్గొన్నారు.

సర్టిఫికెట్స్ అందజేయాలని హైకోర్టు ఆదేశం

నవతెలంగాణ-ముధోల్

ప్రభుత్వం విద్యా సంస్థలకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆపిందనే కారణంతో బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థుల సర్టిఫికెట్స్ ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడం సరికాదని శుక్రవారం హైకోర్టు వ్యాఖ్యానించింది. ట్రిపుల్ ఐటీ పూర్వ విద్యార్థి సామల ఫణికుమార్‌కు సంబంధించిన అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్ సోమవారం రోజు ఇచ్చేయాలని, మంగళవారం ఆ విషయాన్ని కోర్టుకి తెలపాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వం విద్యాసంస్థలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆపిందని, మరే ఇతర కారణాల చేత కూడా విద్యార్థులకు సర్టిఫికెట్స్ ఇవ్వకుండా ఆపకూడదని హైకోర్టు స్పష్టం చేసింది.

ఏడాదిన్నరగా అధికారుల చుట్టూ తిరిగా : ట్రిపుల్ ఐటీ పూర్వ విద్యార్థి సామల ఫణికుమార్

ఏడాదిన్నరగా ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వాలని బాసర ట్రిపుల్ ఐటీ విశ్వవిద్యాలయ అధికారుల చుట్టూ తిరిగా. వైస్ ఛాన్సలర్, స్పెషల్ ఆఫీసర్, చివరికి తెలంగాణ ఉన్నత విద్యా మండలి అధికారులను పలుమార్లు కలిసినా ఎవరూ స్పందించలేదు. హేళన చేస్తూ ప్రభుత్వం కట్టాల్సిన మొత్తం ఫీజు తానే కట్టాలని అడిగారు. తన విషయంలో వెంటనే స్పందించి ఉచితంగా న్యాయ సాయం చేసిన హైకోర్టు న్యాయవాది తక్కురి చందనకు కృతజ్ఞతలు తెలిపారు.

వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని ధని గ్రామంలో డిసిఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఎఎంసి చైర్మన్ హాది, ఆలూరు పిఏసిఎస్ చైర్మన్ మాణిక్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనే పంటను విక్రయించి మొదటి రకం వరి క్వింటాలుకు రూ.2320, రెండవ రకం రూ.2300 ప్రభుత్వం మద్దతు ధర పొందాలన్నారు. అనంతరం ఇటీవల మార్కెట్ చైర్మన్ పదవి బాధ్యతలు చేపట్టిన అబ్దుల్ హదిని, ఇటీవల బదిలీపై వచ్చిన వ్యవసాయ అధికారులను గ్రామస్థులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ అడెల్లి చైర్మన్ అయిటి చందు, మాజీ సర్పంచ్ లక్ష్మీచిన్నయ్య, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి ముత్యంరెడ్డి, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్, బడి పోతన్న, మల్లేష్ పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

నవతెలంగాణ-నార్నూర్

విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలని ఎంపీడీఓ జవహర్‌లాల్ సూచించారు. శుక్రవారం మండలంలోని తాడిహత్నూర్ గ్రామ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించారు. వంట గది, మధ్యాహ్న వండిన అన్నం, పప్పు, కూర, గుడ్లను పరిశీలించారు. బీసీ కాలనీ అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి గర్భిణులు, బాలింతలకు పౌష్టిక ఆహారం అందించాలని టీచర్ ఛాయాను ఆదేశించారు. ముందుగా పంచాయతీ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేశారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, వార్డెన్ దీప్‌సింగ్ ఉన్నారు.

విద్యార్థులకు ఉన్ని దుస్తులు పంపిణీ

జైనథ్ : మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతిగృహంలో శుక్రవారం విద్యార్థులకు వార్డెన్ ఎం.నారాయణ ఉన్ని దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలి నుండి రక్షణకు ప్రభుత్వం విద్యార్థులకు ఉన్ని దుస్తులు పంపిణీ చేస్తోందని తెలిపారు.

మతిభ్రమించి మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

- కేటీఆర్ వ్యాఖ్యలను ఖండించిన కంది



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పదేళ్ల పాటు రాష్ట్రంలో తమ అరాచక పాలనతో అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసి వేల కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన బిఆర్ఎస్ నాయకులు అధికారం కోల్పోయే సరికి మతిభ్రమించి వ్యాఖ్యలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదిలాబాద్‌లో పోరుబాట సభలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని దుర్భాషలాడటం, కాంగ్రెస్ ప్రభుత్వంపై చేసిన విమర్శలను ఖండించారు. శుక్రవారం ప్రజాసేవా భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డిసిసిబి చైర్మన్ అడ్డి భోజారెడ్డితో కలిసి బిఆర్ఎస్ నాయకుల తీరుపై మండిపడ్డారు. పరిశ్రమల శాఖ మంత్రిగా సిసిఐ పునరుద్ధరణపై ఏనాడూ నోరుమెదపని కేటీఆర్ పదవులు కోల్పోయేసరికి ప్రజా సమస్యలు గుర్తుకు వచ్చాయా అని ప్రశ్నించారు. పదేళ్ల పాలనలో రైతులకు లక్ష రుణ మాఫీ చేయలేకపోయారని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన యేడాదిలోనే 20లక్షల కోట్లను రుణమాఫీకి ఖర్చు చేసిందని తెలిపారు. యేడాది కాలంలోనే వివిధ శాఖల్లో 40వేల ఉద్యోగాలతో పాటు 11వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశామన్నారు.

కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం

పోరుబాట సభలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సీఎం రేవంత్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు ఆందోళన చేపట్టారు. ప్రజాసేవాభవన్ వద్ద మాజీ మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి, డిసిసిబి చైర్మన్ అడ్డి భోజారెడ్డి, నాయకులు నగేష్, ఖయ్యూం, శ్రవణ్‌నాయక్, బీడీ చారి, కౌన్సిలర్లు బండారి సతీష్, దర్శనాల లక్ష్మణ్, శ్రీలేఖ పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన ఎస్‌జీఎఫ్ కార్యదర్శి

నవతెలంగాణ-ఖానాపూర్

నవంబర్ 2న మస్కాపూర్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాస్థాయి యోగా పోటీల నిర్వహణ ఏర్పాట్లను జిల్లా పాఠశాల క్రీడల సమాఖ్య కార్యదర్శి అమరవేణి రవీందర్‌గౌడ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ప్రధానోపాధ్యాయులు బోనగిరి నరేందర్‌రావుతో సమావేశమై ఏర్పాట్లను సమీక్షించారు. 4 జిల్లాల్లో నుంచి చాలా మంది విద్యార్థులు వస్తున్నందున వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయుడికి సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బోనగిరి నరేందర్, షేక్ ఇమ్రాన్, తొంటి శంకర్, కుర్ర శేఖర్, జాడి శ్రీనివాస్, వెన్నం అంజయ్య పాల్గొన్నారు.



వన్యప్రాణులకు హాని తలపెట్టొద్దు

- ఎఫ్ఆర్ఓ వేణుగోపాల్

నవతెలంగాణ-సారంగాపూర్

వన్యప్రాణులకు ఎలాంటి హానీ తలపెట్టద్దని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వేణుగోపాల్ అన్నారు. రెండు రోజులుగా బోథ్ అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచరిస్తున్నందున సరిహద్దు అటవీ ప్రాంతం అయిన సారంగాపూర్ సెక్షన్ పరిధిలోని ఇప్పచెల్మ, పెండల్దరి అటవీ గ్రామాల్లో గురువారం రాత్రి వేళ అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. ప్రజలను అప్రమత్తం చేసి, తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. వన్యప్రాణుల సంరక్షణలో అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ టాస్క్‌ఫోర్స్, డీవైఆరోలు నజీర్‌ఖాన్, సంతోష్, ఫాజిల్ హుస్సేన్ ఎఫ్‌బీఓలు పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌లో క్వింటాల్ పత్తికి రూ.10వేలు ఇవ్వాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్‌లో పత్తి క్వింటాలుకు రూ.10వేలు ఇవ్వాలని, తేమశాతం 20కి పెంచాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రారంభం రోజునే పత్తి రైతులు దగాపడ్డారని, దోపిడీకి గురయ్యారని పేర్కొన్నారు. క్వింటాల్ పత్తికి సీసీఐ రూ.7521, ప్రయివేటు వ్యాపారులు రూ.7,150గా నిర్ణయిస్తూ, తేమశాతాన్ని 8 నుంచి 12గా నిర్ణయించారని పేర్కొన్నారు. ఇది పూర్తిగా రైతులకు అన్యాయం చేయడమే అని సీపీఐ(ఎం) భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రారంభంలో పత్తిలో తేమశాతం సహజంగానే ఎక్కువ ఉంటుందని దాన్ని 20 శాతంగా నిర్ణయించాలని పేర్కొన్నారు. రైతులకు గిట్టుబాటు కావాలంటే కనీసం క్వింటాల్‌కు రూ.10 వేలు నిర్ణయించాలన్నారు. బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలు ఇందుకోసం కృషి చేసి రైతులకు న్యాయం చేయాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇందుకోసం గట్టి ప్రయత్నం చేయాలనీ తద్వారా బీజేపీ కాంగ్రెస్‌లకు ఓట్లు వేసి గెలిపించిన రైతులకు న్యాయం చేయాలనీ డిమాండ్ చేస్తున్నట్టు పేర్కొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలువాలి

- నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్తదానం చేసి వారిపాలిట దేవుళ్లుగా మారాలని జిల్లా ఎస్పీ డా. జి.జానకి షర్మిల అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్మల్ పట్టణంలోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్మల్ సబ్ డివిజన్ పోలీస్‌ల ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. మొత్తం 120 యూనిట్ల రక్త సేకరణ చేశారు. ఎస్పీ మాట్లాడుతూ అమరవీరులు సమాజం కోసం, దేశం కోసం, రేపటి తరాల మంచి భవిష్యత్తు కోసం ప్రాణత్యాగాలు చేశారని, వారి త్యాగాలను వెలకట్టలేమన్నారు. అమరుల త్యాగ ఫలంగానే ఈరోజు దేశం, రాష్ట్ర ప్రజలందరూ శాంతియుతంగా, ప్రశాంతంగా ఉన్నారన్నారు. రక్త దానం చేయడం అనేది ఒక సామాజిక సేవా కార్యక్రమమని, క్లిష్ట పరిస్థితులల్లో ఉన్నప్పుడూ ఆపదలో ఉన్న వారి ప్రాణాలు రక్షించడానికి ఎంతో ఉపయోగపడుతుందని ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్తదానం చేసి వారిపాలిట దేవుళ్లుగా మారతారన్నారు. తలసేమియా, క్యాన్సర్, మెడికల్ ఎమర్జెన్సీ పేషంట్లు, బ్లడ్ క్యాన్సర్ రోగులు, హిమోఫీలియా, ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన వారికి, తదితర జబ్బులతో బాధపడుతున్న వారి కోసం ఎక్కువగా రక్తం అవసరం ఉంటుందని అన్నారు. ప్రతి ఒక్కరూ ఇటువంటి సామాజిక సేవలలో పాల్గొని తోటి వారి ప్రాణాలను కాపాడటంలో తమవంతు సహాయంగా రక్త దానం చేయడం అనేది ఒక సామాజిక సేవా కార్యక్రమమని, ఆపదలో ఉన్న ప్రాణాలు రక్షించడానికి ఎంతో ఉపయోగపడుతుందని ఆరోగ్య పరిస్థితిని బట్టి ఆరోగ్యంగా ఉండే ప్రతి మనిషి 6 నెలలకొకసారి రక్తదానం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమం ఘనంగా ఏర్పాటు చేసిన డీఎస్పీ గంగా రెడ్డి టీమ్ నీ ప్రశంసించారు. అనంతరం రక్తదానం చెసిన వారికి పండ్లు మరియు పానీయాలు అందించి అభినందించారు.ఈ కార్యక్రమంలో నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, ఇన్స్‌పెక్టర్‌లు ప్రవీణ్ కుమార్, రామకృష్ణ, నవీన్ కుమార్, ఆర్ఐలు రామ్ నిరంజన్ రావు, శేఖర్, ఎస్సైలు, ఆర్.ఎస్సైలు, పోలీస్ సిబంది, రక్తదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

రూరల్ ఎస్సై రక్తదానం



నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్మల్‌లోని రెడ్డి ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరంలో రూరల్ ఎస్సై రామకృష్ణ రక్తదానం చేశారు. అనంతరం ఆయనకు పండ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఉద్యోగులు, పోలీసులు పాల్గొన్నారు.

అవకతలకు పాల్పడితే చర్యలు తప్పవు

నవతెలంగాణ-నార్నూర్

ఉపాధి హామీ చట్టంలో భాగంగా అవకతలకు పాల్పడితే చర్యలు తప్పవని డీఆర్డీఓ సాయన్న అన్నారు. శుక్రవారం గాదిగూడ మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లోని 2023-24 సంవత్సరానికి నిర్వహించిన సామాజిక తనిఖీల ప్రజావేదికలో మాట్లాడారు. మండలంలోని 25 గ్రామపంచాయతీలో వెజ్ 280 పనుల్లో రూ.4కోట్ల 54లక్షల 30వేల 340, మెటీరియల్ పనుల్లో రూ.8లక్షల 97 వేల 617 మొత్తం కలిపి రూ.4కోట్ల 63 లక్షల 27వేల 957 పనులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా పీఆర్ పనుల్లో భాగంగా నిర్వహించిన 71 పనులకు వేజ్‌కు రూ.16 వేల 068, మెటీరియల్ రూ.2కోట్ల 05లక్షల 35వేల 342 రూపాయల పనులు మొత్తం కలిపి రూ.2కోట్ల 05లక్షల 51 వేల 410 రూపాయల పనులు నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో ఈజీఎస్ పనుల్లో మండలంలోని మొత్తం కలిపి రూ.37వేలు పెనాల్టీ, రూ.1లక్ష 99వేల 806 రూపాయలు రికవరీ చేయాలన్నారు. అదేవిధంగా పీఆర్‌లో నిర్వహించిన పనులకు రూ.1కోటి 69లక్షల 46వేల 121 రూపాయలకు రీకవరీకి ఆదేశించారు. ప్రజావేదికలో అడిషనల్ పీడీ కుటుంబరావ్, ఏపీడీ కృష్ణరావ్, విజిలెన్స్ మేనేజర్ రాజేశ్వర్, వీణ, ఎంపీడీఓ శ్రీనివాస్, తహసీల్దార్ విజయనందం, ఎంపీఓ సాయి ప్రసాద్, ఎస్ఆర్పి తిరుపతి, ఏపీఓ పవార్ నితిన్, టీఏలు కిరణ్, సంజీవ్, పవన్, చంద్ర శేఖర్, అనిల్, మోహన్ ఉన్నారు.

ప్రజల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే..

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్.వెంకట్ రాములు



నవతెలంగాణ-అదిలాబాద్‌రూరల్

ప్రపంచ దేశాల్లో ప్రజల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులేనని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్.వెంకట్‌రాములు అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని యాపల్‌గూడ గ్రామంలో సీపీఐ(ఎం) ఆదిలాబాద్ ఏరియా కమిటీ మహాసభలు ఘనంగా నిర్వహించారు. ముందుగా పార్టీ సీనియర్ నాయకులు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లంక రాఘవులు సీపీఐ(ఎం) పతాక ఆవిష్కరణ చేశారు. అనంతరం ప్రజల కోసం తమ జీవితాన్ని ధారపోసి అమరులైన వీరులకు నివాళు లర్పించారు. మహసభ ప్రారంభానికి ముందు అమర వీరులకు 2 నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం జరిగిన ప్రారంభ ఉపన్యాసంకు ముఖ్య అతిథిగా హజరై మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడుదారుల పెత్తనం చెలయించడం కోసం దేశాల మధ్య యుద్దాలు సృష్టించి ప్రజల ప్రాణాలు తీస్తున్నారని విమర్శించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రజా సమస్యలను గాలి కోదిలేసి మతం పేరిట రాజకీయాలు చేస్తూ, ప్రజలను విభజిస్తున్నారని విమర్శించారు. ఒకే దేశం ఒకే ఎన్నిక పేరుతో, భారత రాజ్యాంగాన్ని, ఫెడరల్ వ్యవస్థకు భిన్నంగా ఎన్నికలను నిర్వహించే పద్ధతిని సీపీఐ(ఎం) వ్యతిరేకిస్తుందని తెలిపారు. ప్రజా ఉద్యమాలను అణిచి వేసేందుకు నూతన క్రిమినల్ చట్టాలు తెచ్చిందని వీటికి వ్యతిరేకంగా పోరాడతామని తెలిపారు. రేణుక సిమెంట్ ఫ్యాక్టరీ భూనిర్వసితులకు ఎకరానికి రూ.40లక్షలు చెల్లించి, భూములు తీసుకోవాలని అన్నారు. సాత్నాల ఎడమ కాలువ ద్వారా రైతులకు సాగు నీరు అందించాలని అన్నారు. మండల సమగ్ర అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. పోడు సాగుదారులకు హక్కు పత్రాలు ఇవ్వాలని, ఇండ్లు లేని నిరుపేదలకు ఇండ్లు నిర్మించి ఇవ్వాలని, లేని పక్షంలో పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం మండల సమగ్ర అభివృద్ధికి అధిక నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలనీ సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లంక రాఘవులు తీర్మానం ప్రవేశ పెట్టారు. రేణుక సిమెంట్ ఫ్యాక్టరీ భూనిర్వసితులకు ఎకరానికి రూ.40లక్షలు ఇవ్వాలని తీర్మానం ఏకగ్రీవంగా అమోదించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లేష్, పూసం సచిన్, కిరణ్ జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ ఆశన్న, మంజుల, ఆత్రం కిష్టన్న, సురేందర్, గంగన్న, మండల కార్యదర్శి స్వామి, నాయకులు ఉయిక విష్ణు, ఆశన్న, డి స్వామి, గంగారెడ్డి, ప్రజలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



పోలీసు అమరుల త్యాగాలను స్మరించుకోవాలి

- పట్టణంలో పోలీసుల ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పోలీసు అమరులు చేసిన త్యాగాలను ప్రతి ఒక్కరు స్మరించుకోవాలని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా శుక్రవారం ఉదయం పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన సైకిల్ ర్యాలీ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం ముఖ్యఅతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ ర్యాలీ పట్టణంలోని స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్ అమరవీరుల స్థూపం వద్ద జెండా ఊపి ప్రారంభమైందన్నారు. కలెక్టర్ చౌరస్తా, ఎన్టీఆర్‌చౌక్, వినాయక్ చౌక్, దేవి చంద్ర చౌక్, గాంధీ చౌక్, అంబేద్కర్ చౌక్, నేతాజీ చౌక్, బసవేశ్వర చౌక్, బస్టాండ్ మీదుగా స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ప్రాంగణం వద్ద ముగిసింది. ఈ ర్యాలీలో పాల్గొన్న ప్రజలు, విద్యార్థులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. అదేవిధంగా జిల్లా పోలీసులు, రెండవ బెటాలియన్ సిబ్బంది ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ అమరవీరుల సంస్మరణ దినోత్సవ వారోత్సవాల సందర్భంగా సైకిల్ ర్యాలీని ఏర్పాటు చేయడం జరిగిందని ఈ సైకిల్ ర్యాలీ ముఖ్య ఉద్యేశం పోలీసు అమరవీరులు చేసిన త్యాగాలను జిల్లా ప్రజలకు తెలియజేయాలని సదుద్దేశంతో మరియు పోలీసులు చేసే కఠినతరమైన విధులను ప్రజలకు తెలియజేయాలని ఉద్యేశంతో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సంవత్సరం దేశవ్యాప్తంగా అమరులైన 214 పోలీసులను స్మరించుకోవాలని జిల్లాకు చెందిన ఆడే ప్రవీణ్ గత సంవత్సరం పోలీసు విధులను నిర్వర్తించే క్రమంలో అమరుడైన విషయాన్ని గుర్తు చేశారు. ముఖ్యంగా ఈ ర్యాలీలో పాల్గొన్న శిక్షణ నిమిత్తం వచ్చిన సివిల్ సర్వీస్ అధికారులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. ఇలాంటి ప్రజాహిత కార్యక్రమాలు పోలీసు అమరవీరులను అనునిత్యం స్మరించుకుంటూ, నిరంతరం ప్రజలలో చిరస్మరణీయంగా ఉండటానికి నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజలలో పోలీసుల సత్సంబంధాలను మెరుగుపరుచుకుంటూ, పబ్లిక్ పోలీస్ రిలేషన్‌ను పెంపొందించాలని తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.సురేందర్ రావు, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, ఎల్.జీవన్ రెడ్డి హసీబుల్లా, బి.సురేందర్‌రెడ్డి పట్టణ సీఐలు, రిజర్వుడ్ ఇన్స్‌పెక్టర్లు, ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

కేటీఆర్ రైతు సంక్షేమంపై మాట్లాడటం హాస్యాస్పదం

- తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ రైతుల సంక్షేమం గురించి మాట్లాడటం హాస్యస్పదంగా ఉందని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పదేండ్ల పాలనలో రూ.లక్ష రుణమాఫీని పూర్తిగా చేయలేనటువంటి అసమర్ధ ప్రభుత్వం బీఆర్ఎస్ దేనన్నారు. మాజీ సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని, వారు చేసిన అప్పులకు కోట్ల రూపాయలను తమ ప్రభుత్వం వడ్డీ కడుతుందన్నారు. ప్రభుత్వ ఆర్థిక స్థితి బాగా లేకున్నప్పటికి ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీ మేరకు రూపాయలు రెండు లక్షల రుణమాఫీని అమలు చేసిన ఘనత సీఎం రేవంత్ రెడ్డికి దక్కుతుందన్నారు. దీన్ని స్వాగతించాల్సింది పోయి రాజకీయ లబ్ది కోసం రైతులను తప్పుదోవ పట్టించేలా అసత్య ప్రచారం చేయడం కేటీఆర్ దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. కేటీఆర్ రైతుల సంక్షేమం పేరిట మొసలి కన్నీరు కార్చడం విడ్డూరంగా ఉందన్నారు. జిల్లా కేంద్రంలోనీ బహిరంగ సభలో కేటీఆర్ చేసిన మాటలను విని ప్రజలు నవ్వుకుంటున్నారని తెలిపారు. రైతుల కోసం ఏడాదికైనా జైలుకు వెళ్తానని ప్రకటించిన కేటీఆర్ తాను చేసిన బాగోతాలకు ఎప్పటికైనా జైలుకి వెళ్లడం ఖాయమన్నారు. కేటీఆర్, బీఆర్ఎస్ నాయకులు ఇప్పటికైనా తమ తీరును మార్చుకొని రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతులే నాయకులను తరిమికొట్టే పరిస్థితులు వస్తాయనీ హెచ్చరించారు. సమావేశంలో కాంగ్రెస్ మావల మండలాధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు తాడిసేన వెంకట్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కుదురుపాక సురేష్, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు వేముల నాగరాజు, కోఆప్షన్ సభ్యులు రహీమ్‌ఖాన్ ఉన్నారు.

ప్రభుత్వ అలసత్వంతోనే చేపల పిల్లల విడుదల ఆలస్యం

నవతెలంగాణ-తాంసి

రాష్ట్ర ప్రభుత్వం అలసత్వంతోనే మత్స్యకారులకు సమయానికి చేప పిల్లలను విడుదల చేయలేక పోతుందని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ రాష్ట్ర ప్రభుత్వంపై అసహనం వ్యక్తం చేశారు. శుక్రవారం మండలంలోని వడ్డాడి ముత్తడివాగు ప్రాజెక్టులో మత్స్యశాఖ ఆధ్వర్యంలో మత్స్యకారులకు ఉపాధిలో భాగంగా సబ్సిడీపై అందించే వివిధ రకాల చేప పిల్లలను ప్రాజెక్టులో మండల నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో వర్షాకాలంలో మాత్రమే చెరువులు 100శాతం సబ్సిడీపై చేప పిల్లలను వేశామన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత చేపలు పట్టే సమయంలో చేప పిల్లలను వేయడం వింతగా కనిపిస్తుందన్నారు. గతంలో వేసిన చేప పిల్లల సరఫరా చేసిన వారికి ఇంత వరకు డబ్బులు ఇవ్వకపోవడమే కారణమని అనిపిస్తోందన్నారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం కేవలం రూ.2లక్షల 90 వేల చేపలను పిల్లను మాత్రమే సరఫరా చేయడం జరిగిందన్నారు. మరో కొన్ని రోజుల్లో రైతులు రెండో పంటలలు పండించడానికి ప్రాజెక్టు నుంచి నీటిని వదలడం జరుగుతుందన్నారు. ప్రాజెక్టుల్లో చెరువుల్లో నీటిమట్టం తగ్గిపోయి చేపలు పెరగడానికి వీలు ఉండదన్నారు. వేసిన చేప పిల్లలు చనిపోయే ప్రమాదం ఉంటుందన్నారు. వర్షాకాలంలోనే చేపలను వేయడం మంచిదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కరు కూడా సంతోషంగా లేరన్నారు. కార్యక్రమంలో నాయకులు వినోద్‌రెడ్డి, రఘు, కృష్ణ, రమణ, మహేందర్, గోవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్, వెంకటేష్, అభిరామ్‌రెడ్డి, రజినీ, మత్స్యశాఖ అధికారులు వివిధ మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆటో కార్మికుల హామీల అమలుకు పోరాడుదాం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో కార్మికులకు ఇచ్చిన హామీల అమలుకు పోరాడుదామని టీయూసీఐ అనుబంధ తెలంగాణ ప్రోగ్రెసివ్ ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జగన్ సింగ్ అన్నారు. శుక్రవారం ఛలో హైదరాబాద్ నవంబర్ 5న ఇందిరాపార్క్ ధర్నా చౌక్‌లో మహాధర్నా పోస్టర్‌లని రైల్వేస్టేషన్ వద్ద ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా జగన్ సింగ్, అదిలాబాద్ ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు దళిత్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు, ఆటో మోటార్ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తామని, ఆటో మెయింటెనెన్స్ కోసం సంవత్సరానికి రూ.12వేలు ఇస్తామని వాగ్దానం చేసిందన్నారు. నేటికీ 10 నెలల కాలం అవుతున్న, వాగ్దానాలు అమలు చేయకపోవడం మూలంగా, తెలంగాణ రాష్ట్రంలోని ఆటో సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నవంబర్ 5వ తేదీన ఇందిరాపార్క్ ధర్నాచౌక్‌లో మహాధర్నా కార్యక్రమానికి పిలుపునిచ్చిందన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం మూలంగా, ఆటోల్లో ఎక్కే ప్యాసింజర్లు కరువై, ఆటో రంగం దివాళా తీసిందని, దీని మూలంగా ఆటో డ్రైవర్లు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆటో ఫైనాన్స్ కిస్తీలు కట్టలేక, పిల్లలకు స్కూల్ ఫీజులు, ఇంటి కిరాయి చెల్లించలేక, ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చేసి మహాలక్ష్మి పథకం ద్వారా నష్టపోతున్న ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని డిమాండ్ చేశారు కార్యక్రమంలో ఉమ్రే నితిన్, కొడుప సురేష్, ఇర్ఫాన్, సిడం సాయి, షేక్ రఫీక్, పి.రాములు, షేక్ ఇమ్రాన్, ఆసిఫ్ ఖాన్, ఎస్.సైమల్, గులాబ్ సింగ్, సయ్యద్ అనీష్, సయ్యద్ ముజాహిద్దీన్, షేక్ రహీం, షేక్ కరీం, ఇర్ఫాన్, అస్లాం బేక్, డబ్లు అవినాష్, ప్రభాకర్ ఉన్నారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి యువకుడి మృతి

నవతెలంగాణ-కుభీర్

ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒకరు మృతి చెందిన సంఘటన కుభీర్ మండలంలోని సౌంలి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... తానూర్ మండలంలోని ఎల్వత్ గ్రామానికి చెందిన అవధూత్ రాజారత్న(22) మండలంలోని సౌంలి గ్రామంలోని పెద్దమ్మ ఇంటికి 4రోజుల కిందటగా వచ్చారు. దీంతో గురువారం సాయంత్రం సమయంలో వరుసకు అన్నయ్య సందీప్‌తో కలిసి వ్యవసాయ క్షేత్రంలోకి వెళ్లి సోలర్ పెన్సింగ్ కొరకు కట్టెలు తీసుకురావడానికి వెళ్లారు. కట్టెలు జామ చేసిన తర్వాత సౌంలి చెరువులోకి స్థానానికి దిగి ప్రమాదవశాత్తు లోపలికి పడిపోయాడు. దీంతో పక్కనున్న సందీప్ గమనించి, చుట్టూ పక్కలా ప్రజలకు పిలవగానే చేరువులో వెతకగా రాజారత్న ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం గ్రామస్తులు చెరువులో వెతకగా రాజారత్న మృతదేహం లభించింది. దీంతో మృతుడి తండ్రి గంగాధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రవీందర్ తెలిపారు.

గోదావరిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

నవతెలంగాణ-లోకేశ్వరం

గోదావరిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన మండలంలోని పంచగుడి బ్రిడ్జి వద్ద గల గోదావరి నదిలో చోటు చేసుకుంది. ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం... శుక్రవారం ఉదయం దాదాపు 7 గంటల సమయంలో గుర్తు తెలియని పురుషుని మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో కనిపించింది. మృతుని వయసు 55 నుంచి 60 సంవత్సరాలు ఉంటుందని, అతని శరీరం పై నారింజ రంగు (ఆరెంజ్) టీ షర్ట్ ధరించి ఉన్నదని తెలిపారు. మృతుని ఆచూకీ ఎవరికైనా తెలిసినచో లోకేశ్వరం పోలీసు స్టేషన్‌లో లేదా మొబైల్ నెంబర్ 8712659541 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

క్విజ్‌లో గెలుపొందిన విద్యార్థులకు సన్మానం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో ఆర్బీఐ వారోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులకు మూడు రోజుల పాటు క్విజ్ పోటీలు నిర్వహించారు. కాగా ఈ పోటీల్లో కళాశాల స్థాయిలో విద్యార్థులు ఎస్.శ్రీజ, పి.విఘ్నేశ్వరి గెలుపొందారు. శుక్రవారం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. అతిక్ బేగం ఛాంబర్‌లో విద్యార్థులకు పూలబొకే అందించి అభినందనలు తెలిపారు. అదేవిధంగా రాష్ట్రస్థాయిలో కూడా గెలవాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ రఘు, గణపతి, కృనాల్, సౌజన్య బోధన సిబ్బంది పాల్గొన్నారు.

బోరు మోటార్‌కు మరమ్మతులు



నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ పట్టణంలోని డబుల్ బెడ్ రూమ్ కాలనీ వద్ద మూడు రోజుల కింద తాగునీటి బోరు మోటర్ మరమ్మతులకు గురై నీరు రావడంలేదని విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మెన్ రాజూరా సత్యం తాగునీటి సమస్యను తీర్చారు. శుక్రవారం మున్సిపాలిటీ వాటర్ సప్లై సిబ్బంది చేత బోరు మోటర్‌కు మరమ్మత్తులు చేయించారు. కాలనీలోని సమస్యను తీర్చినందుకు ఆయనకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ వాటర్ సప్లై సిబ్బంది డబుల్ బెడ్ రూమ్ కాలనీవాసులు, మహిళలు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
శనివారం | అక్టోబర్ 26, 2024 | www.navatelangana.com

సింగరేణిలోనే ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశం

నవతెలంగాణ-రెబ్బెన

ఉద్యోగంలో గుర్తింపుతోపాటు కింది స్థాయి నుంచి ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశాలు సింగరేణి సంస్థలోనే ఉన్నాయని బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం జీఎం కార్యాలయం ఆవరణలోని కాన్ఫరెన్సు హాల్‌లో మెడికల్ ఇన్వాలిడేట్ అయిన ఉద్యోగులు ముగ్గురు వారసులకు ఉద్యోగ నియామక పత్రాలు, తొమ్మిది మంది బదిలీ వర్కర్లకు సర్ఫేజ్ జనరల్ మజ్దూర్ ఉద్యోగోన్నతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా ఉద్యోగంలో చేరే యువతి, యువకులు నిబద్ధతతో పనిచేసి సంస్థ వారి కుటుంబం ఎదుగుదలకు కృషి చేయాలన్నారు. విధులకు గైర్హాజరు కాకుండా అధికారుల సూచనలు, ఆదేశాల మేరకు విధులు నిర్వర్తించి ఉత్తమ ఉద్యోగులుగా పేరు తెచ్చుకోవాలని అన్నారు. బొగ్గు నిల్వలకు కొదువ లేదని అందుకే సింగరేణి సంస్థకు మంచి మనుగడ ఉందన్నారు. పనికి వెనుకాడ వద్దని, వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు బయ్య మొగిలి, ఎస్ఓ టూ జీఎం కె రాజమల్లు డీజీఎం(ఐఈడీ) ఉజ్వల్ కుమార్ బెహరా, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పర్సనల్ అధికారులు ఎం శ్రీనివాస్, డి ప్రశాంత్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్ బాల్ పోటీలకు ఆదర్శ విద్యార్థి ఎంపిక

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో చదువుతున్న విద్యార్థి రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మహేష్ మాట్లాడుతూ బైపీసీ చదువుతున్న మల్లికార్జున్ మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఠాగూర్ స్టేడియంలో నిర్వహించిన అండర్-19 ఫుట్‌బాల్ జోనల్ పోటీలలో పాల్గొని రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడని అన్నారు. విద్యార్థి రాష్ట్రస్థాయిలో కూడా ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. విద్యార్థిని అభినందించిన వారిలో వ్యాయామ ఉపాధ్యాయులు తిరుపతి, మహేష్, రాకేష్, పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోవలక్ష్మికి హైకోర్టులో ఊరట

నవతెలంగాణ-ఆసిఫాబాద్

గత 2023లో జరిగిన ఎన్నికల్లో ఆసిఫాబాద్ ఎమ్మెల్యేగా గెలిచిన కోవలక్ష్మి ఆదాయ పన్ను వివరాలను తప్పుగా చూపిందంటూ ఆమె ఎన్నికను రద్దు చేస్తూ తనను ఎమ్మెల్యేగా ప్రకటించాలని కాంగ్రెస్ అభ్యర్థి శ్యాం నాయక్ హైకోర్టులో కేసు వేయగా గత తొమ్మిది నెలల నుంచి వాదోపవాదాలు విన్న హైకోర్టు శ్యాం నాయక్ పిటిషన్‌ను కొట్టివేస్తూ ఉత్తర్వులు వెలువరించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోవలక్ష్మి మాట్లాడుతూ తప్పులు చేయడం తమకు అలవాటు లేదని చురకలు అంటించారు. తన నిజాయితీని కోర్టు ద్వారా మరోసారి నిరూపించుకొనే అవకాశం వచ్చిందని తెలిపారు.

సీఐగా బాధ్యతల స్వీకరణ



నవతెలంగాణ-రెబ్బెన

రెబ్బెన సీఐగా బుద్దే స్వామి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రామగుండం కమిషనరేట్‌లోని సీసీఆర్బి నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. రెబ్బెన సీఐగా విధులు నిర్వహించిన చిట్టి బాబ బదిలీపై హైదరాబాద్ మల్టీ జోన్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో బుద్దే స్వామి వచ్చారు. గతంలో కూడా ఆసిఫాబాద్ జిల్లాలో పలు పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించారు. బాధ్యత యుతంగా విధులు నిర్వర్తిస్తూ, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ, బాధితులకు సత్వర న్యాయం చేకూర్చే విధంగా అందుబాటులో ఉంటానని సీఐ తెలిపారు.

ఎస్పీని కలిసిన నూతన సీఐలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

విధుల్లో చేరిన రెబ్బెన సీఐ బుద్దే స్వామి, కాగజ్‌నగర్ సీఐ రాజేంద్రప్రసాద్‌లు జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ విధులు నిర్వహించాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన సీఐకి సన్మానం

ఆసిఫాబాద్ నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన బుద్దే రవీందర్‌ను బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పురుషోత్తం బాలేష్, ప్రధాన కార్యదర్శి గాజుల జక్కన్న, రైతు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వైరాగడే మారుతి పటేల్, ప్రధాన కార్యదర్శి గడ్డల శంకర్, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు లోబడే లహు కుమార్, మాలి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగోశే శంకర్, నాయకిని రాజన్న, సంఘ సభ్యులుడాక్టర్ కేదారి గౌడ్, రవికాంత్, కమ్మల వెంకన్న, వనం మధుకర్, శ్రీనివాస్ చారి, పూదరి నారాయణ, శ్రీనివాస్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

సమాజ శ్రేయస్సు కోసమే పోలీసులు



నవతెలంగాణ-తిర్యాణీ

సమాజ శ్రేయస్సు కోసమే పోలీసులు పనిచేస్తున్నారని ఎస్ఐ తీగల మాధవ్‌గౌడ్ అన్నారు. శుక్రవారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల విద్యార్థులచే ఓపెన్‌హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోలీస్‌స్టేషన్‌లోని వివిధ విభాగాలు ఎలా పనిచేస్తాయనే అంశాలను సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో జరిగే అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడానికి పోలీసులు నిరంతరం పనిచేస్తుంటారని విద్యార్థులకు తెలిపారు. ప్రజలు ఏ అవసరం వచ్చిన పోలీసులను సంప్రదించాలని కోరారు. ఎవరైనా ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినట్టయితే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ విద్యార్థులకు ఓపెన్‌హౌస్ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ ప్రభాకర్, రవీందర్, కానిస్టేబుల్ శంకర్, శ్రీనివాస్, రజిత, అపర్ణ, హోంగార్డు ఇంద్ర, తుకారాం, జంగు పాల్గొన్నారు.

మహారాష్ట్ర డీజీపీ సమావేశంలో జిల్లా ఎస్పీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆ రాష్ట్ర డీజీపీ సరిహద్దు రాష్ట్రాల డీజీపీలు, జిల్లా ఎస్పీలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ డివి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహారాష్ట్ర డీజీపీ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికల ప్రశాంతంగా జరగడానికి సరిహద్దు రాష్ట్రాల పోలీసులు సహకరించాలని కోరారు. ఎస్పీ డివి శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలంగాణ, మహారాష్ట్ర జిల్లా సరిహద్దు వద్ద చెక్‌పోస్టుల్లో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. జిల్లా నుంచి మహారాష్ట్రలోకి ప్రవేశ, నిష్క్రమణ మార్గాలలో నాలుగు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. వాటి ద్వారా మహారాష్ట్రలోకి అక్రమంగా డబ్బు, మద్యం ఏ ఇతర వస్తువులు అక్రమంగా తరలించకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేసినట్లు తెలియజేశారు. మహారాష్ట్రలో జరుగబోయే ఎన్నికల దృష్ట్యా మావోయిస్టుల కదలికలు, సరిహద్దు ప్రాంతాల్లో అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎప్పటికప్పుడు ఏరియా డామినేషన్ కూంబింగ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

గిరి పల్లెల్లో దండారి సందడి

- ముస్తాబైన గిరి గ్రామాలు
- బలి దానంతో ఉత్సవాలు ప్రారంభం





నవతెలంగాణ-కెరమెరి

ఆదివాసీల పెద్ద పండుగ దండారి గిరిజనుల తీరు ప్రత్యేకం వారి ఆచార వ్యవహారా లు సంస్కృతీ, సంప్రదాయాలు భిన్నంగా ఉంటాయి. గోండు గూడాల్లో గిరిజనుల జీవనశైలిని ప్రతిభింబించే దండారీ ఉత్సవాలు శనివారం ప్రారంభంకానున్నాయి. విచిత్ర వేశధారణతో, అంతే అద్భుతమైనా పద్ధతులతో వారు చేసే పూజలు, ఏర్పాట్లు వారి సంప్రదాయాలను పరి చయం చేస్తాయి. గోండు గూడాల్లో గిరిజనుల జీవనశైలిని ప్రతిభింబించే దండారీ గుస్సాడి ఉత్సవాలు దీపావళికి ముందు మొదలవుతుంది.

బలిదానంతో దండారి మొదలు

ఆదివాసీలు గ్రామ కూడలిలో నెమలి ఈకలతో ప్రత్యేకంగా తయారు చేసిన టోపీలు, జంతు చర్మంతో తయారు చేసిన డప్పులు, డోలు, గుమేల, ఫరా లాంటి వాయిద్యాలతో పాటు గజ్జెలు, కోలాలు, మంత్రదండం లాంటి రోకలి తది తర సంప్రదాయ వస్తువులను గ్రామ పటేల్ ఇంటి ముందర ఉంచి వాటికి బలిదానం చేసి ప్రత్యేక పూజలతో భోగి పండుగ చేసి ఉత్సవాలను ప్రారంభిస్తారు. గిరిజన గోండు గూడాల్లో పటేల్‌ది ప్రత్యేమైన స్థానం. ఆయన ఊరి పెద్దగా వ్యవహరిస్తారు. దండారి ఉత్సవాలు గ్రామ పటేల్ ఇంటి ముందే నిర్వహించడం ఆనవాయితీ.

ప్రత్యేక వేషధారణలు

దండారి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజుల పాటు గుస్సాడి వేషధారణతో దండారి ముగింపు వరకు స్నానం చేయకుండా ఉంటారు. ఒంటికి బూడిద పూసుకుని దాన్నే స్నానంగా భావించడం వీరి ఆచారం. దీనితో పాటు ముఖానికి మసి, ఎడమ భుజంపై జింక తోలు, మెడలో రుద్రాక్షలు, కుడి చేతిలో మంత్రదండం(రోకలి), జంతువుల కొమ్ములు, నెమలి ఈకలతో చేసిన టోపీలు, కాళ్లకు గజ్జెలు, నడుముకు వారి వస్తువుల సంచితో విచిత్ర వేషధారణతో ఉత్సవాలు నిర్వహించుకుంటారు.

ఇతర గ్రామాల్లో ఆతిథ్యం

గుస్సాడి వేషధారణ వేసిన వారు ఒక సంవత్సరం తమ సొంత గ్రామం నుంచి మరో గ్రామానికి వెళ్ళి అక్కడి గిరిజనుల ఆథిత్యం విందులో పాల్గొని ఆటపాటలతో, నృత్యాలతో అలరిస్తారు. దీంతో ఇతర గ్రామాలకు వెళ్లిన గుస్సాడిలకు ఘన స్వాగతం పలుకుతారు. మొదట ఆథిత్యం పుచ్చుకున్న వీరు తర్వాతి సంవత్సరం తమ గ్రామానికి ఆహ్వానిస్తారు. ఇలా ఆ గ్రామాల మధ్య సంబంధాలు పెరుగుతాయని భావిస్తారు.



గుస్సాడి వేషాలు.. థింసా నృత్యాలు

కోరిన కోరికలు నెరవేరుతాయని ప్రగాఢ విశ్వాసంతో గిరిజనులు గుస్సాడి వేషాన్ని ధరించేందుకు ఆసక్తి చూ పుతారు. గుస్సాడి వేషధారణ వేసిన వారికి వారి దేవతలు ఆవహిస్తారని చెబుతారు. అతని చేతికి ఉన్న మంత్రదండం శరీరాన్ని తాకితే ఎలాంటి రోగాలైనా నయమవుతాయని వారి నమ్మకం. డప్పులు, బాజాలతో చప్పుళ్లకు అనుగు నంగ గజ్జెల అడుగులతో లయబద్దంగ నాట్యం చేస్తూ గుస్సాడి నృత్యాలు చేస్తారు. గోండు గిరిజన మహిళలు కూడా పురుషులతో సమానంగా థింసా నృత్యం ప్రత్యే ఆకర్శనగా నిలుస్తుంది.

నువ్వుల నూనెతో పూజలు

గిరిజన గ్రామాల్లో ప్రతీ ఇంట్లో దీపావళి సందర్భంగా మహిళలు పవిత్రంగా ఉపవాస దీక్ష చేస్తూ నువ్వులను రోటిలో దంచి నూనెను తీస్తారు. ఆ నూనెతో దండారి ము గింపు వరకు దీపాలను వెలిగించి పూజలు చేస్తారు.

నెమలి టోపీలకు కేరాఫ్ పాటగూడా

నెమలి పింఛం టోపీల తయారిలో కెరామెరి మండలంలోని పాటగూడ గ్రామం ప్రసిద్ధి గాంచింది. గడిచిన పాతి కేళ్ల నుంచి ఈ గ్రామస్థులు నెమలి టోపీలను తయారు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని ఇంద్రవెల్లి, బజార్‌హత్నూర్, ఉట్నూర్, ఇచ్చోడ, ఇంద్ర వెల్లి, జైనూరు, సిర్పూర్(యు), కెరమెరి, తిర్యాని, వాంకిడి తదితర మండలాలకు చెందిన వారు ఇక్కడి నుంచి నెమలి పింఛం టోపీలను కొనుగోలు చేసి తీసుకెళ్తుంటారు. ఒక్క టోపీ ఖరీదు రూ.10వేలు పలుకుతున్నా. వీరు కేవలం రూ.3వేలు కూలి కింద తీసుకుంటున్నారు.

కొలబోడితో దండారి ముగింపు

దీపావళి మరుసటి రోజు కొలబోడి ఉత్సవాలను దండారి సంబురాలు ముగిస్తారు. దీపావళి అనంతరం గుస్సాడీలు చివరి రోజున నృత్యాలు చేస్తారు. అనంతరం గ్రామ పొలిమేరల్లో ఇప్ప చెట్టు వద్ద భీందేవుని సన్నిధికి చేరుకుంటారు. అక్కడ కొలబోడి సందర్భంగా నెమలి టోపీలను తొలగించి కోళ్లు, మేకలతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

నియమ నిష్టలతో జరుపుకుంటాం

పెందూర్ ఆనంద్ రావు మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్



ఆదివాసీలు దీపావళి పండగ సమీపిస్తున్న తరుణంలో దండారి ఉత్సవాలను ప్రతి గిరిజన గూడెంలో ఘనంగా జరుపుకుంటాం. ఉత్సవాల సమయంలో నియమ నిష్టలతో ఉంటారు. ఉపవాస దీక్షలతో పూజలు చేస్తారు. భవిష్యత్ తరాలకు మా ఆచార వ్యవహారాలు, సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడు కునేందుకే ఈ పండగను ఘనంగా నిర్వహిస్తాం.

పంట నష్టపరిహారం ఇవ్వాలని రైతుల ధర్నా



నవతెలంగాణ-బెజ్జూర్

గత వర్షాకాలంలో భారీ వర్షాలకు నష్టపోయిన పంటకు నష్టపరిహారాన్ని వెంటనే చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై రైతులు ధర్నాకు దిగారు. నష్టపరిహారం అందించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని దీంతో తాము నష్టపోవాల్సిన పరిస్థితి ఎదురైందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పక్క మండలాలకు పంట నష్టపరిహారం వచ్చినప్పటికీ కేవలం బెజ్జూర్ మండలానికి నష్టపరిహారం అందలేదని దీనికి వ్యవసాయ అధికారులే కారణమని ఆరోపించారు. సర్వే చేయడంలో నిర్లక్ష్యం వహించిన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. పంట నష్టం పరిహారం అందే విధంగా అధికారులు చొరవ చూపాలని వారు కోరారు. ప్రాణహిత పరివాహక ప్రాంతాల్లో పంట నీట మునిగి తీవ్రంగా నష్టపోయామని తమను ప్రభుత్వం ఆదుకొనడంలో నిర్లక్ష్యం వహించిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎకరాకు రూ. 10 వేలు అందించిందని కానీ తమకు ఒక్క రూపాయి కూడా పరిహారం అందలేదని తెలిపారు. పంట నష్టపరిహారం సర్వేలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సుమారు గంటపాటు వాహనాలు నిలిచిపోవడంతో పోలీసులు, తహసీల్దార్ భూమేశ్వర్ ధర్నా వద్దకు వచ్చి రైతులతో మాట్లాడి నచ్చజెప్పారు. దీంతో రైతులు ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బషరత్ ఖాన్, లంగారి శ్రీనివాస్, దుర్గం శంకర్, సకారం, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సంచార, అర్థసంచార విముక్త జనజాతి టాస్క్ పోర్స్' ఛైర్మన్‌గా శేషారావ్ రాథోడ్

నవతెలంగాణ-కెరమెరి



మండలంలోని అనార్‌పల్లి గ్రామానికి చెందిన తాజా మాజీ సర్పంచ్ రాథోడ్ శేషారావ్ రాష్ట్ర సంచార, అర్థ సంచార విముక్త జనజాతి టాస్క్ పోర్స్ ఎస్సి డిపార్ట్‌మెంట్ తెలంగాణ ప్రదేశ్ కమిటీ ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. శేషారావ్ నియామకానికి సభందించిన ఉత్తర్వులను ఎస్సి డిపార్ట్‌మెంట్ ఛైర్మన్ అల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఛైర్మన్ రాజేష్ లోతియా జారీ చేశారు. ఆయన నియామకం పట్ల జిల్లా ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా శేషారావ్ మాట్లాడుతూ డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వ ప్రసాద్ రావు, ఎస్సీ కార్పోరేషన్ ఛైర్మన్ ప్రీతమ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలోని సంచార, అర్థ సంచార జనజాతి (డీఎన్‌టీ) సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో ఈ పదవి అప్పగించిన నేపథ్యంలో రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ పెద్దలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ బాధ్యతగా తన కర్తవ్యాన్ని నిర్వర్తిస్తానని పేర్కొన్నారు.

విద్యా రంగంలోని సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-కెరమెరి

విద్యారంగ సమస్యల పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి జాఫర్ అన్నారు. శుక్రవారం తహసీల్దార్ దత్తు ప్రసాద్ రావును కలిసి వినతి పత్రం అందజేశారు. గత కొన్ని సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నటువంటి స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా స్కాలర్‌షిప్ పెంచాలన్నారు. గత నెల రోజుల నుంచి తెలంగాణ రాష్ట్రంలో దశలవారీగా స్కాలర్‌షిప్ విడుదల చేయాలని ప్రయివేట్ కళాశాలల యాజమాన్యాలు సైతం బందుకు పిలుపునిచ్చి, నిరసన వ్యక్తం చేసినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని అన్నారు. వెంటనే స్పందించి పరిష్కరించాలని ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు చటారే భీంరావు, నాయకులు గిత్తే కిరణ్ పాల్గొన్నారు.

కౌటాల : పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రియింబర్స్మెంట్స్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చెయ్యాలని శుక్రవారం ఎస్ఐపై మండల అధ్యక్షుడు అనికేత్ మండల ప్రధాన కార్యదర్శి ఎలుములె సాయినాథ్ కళాశాల విద్యార్థులతో కలిసి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించిన అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వినతి పత్రం అందజేశారు.



కెరమెరి



కౌటాల

అనారోగ్యంతో కారోబారి మృతి

నవతెలంగాన-దహెగాం

మండలంలోని అయినం గ్రామానికి చెందిన గ్రామపంచాయతీ కారోబార్ జాడి మల్లయ్య(35) అనారోగ్యంతో గురువారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో శుక్రవారం ఎంపీడీఓ రాజేందర్‌తో పాటు పంచాయతీ కార్యదర్శులు పంచాయతీ కార్మికులు మృతుడు కుటుంబాన్ని పరామర్శించి నివాళ్లు అర్పించారు. మతుడి కుటుంబానికి పంచాయతీ రాజ్ అధికారులు కార్మికులు కలిసి రూ.25000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రాజేందర్ మాట్లాడుతూ మృతుడి కుటుంబాన్ని పంచాయతీరాజ్ శాఖ తరపున అన్ని విధాలుగా ఆదుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ ఆత్మారాం పంచాయతీ కార్యదర్శులు ప్రణీత్, విజయ్, శివ కృష్ణ, శ్రీకాంత్, సాయి, రఘు పాల్గొన్నారు.

సీసీఐకి పత్తిని విక్రయించి మద్దతు ధర పొందాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రైతులు పత్తిని జిల్లాలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాలకు విక్రయించి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర పొందాలని మార్కెటింగ్ అధికారి గజానంద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నవంబర్ నెల మొదటి వారంలో జిల్లాలో సీసీఐ ఆధ్వర్యంలో జిన్నింగ్ మిల్లులలో పత్తి కొనుగోలు ప్రక్రియ ప్రారంభించే అవకాశం ఉందని, రైతులు తమ పత్తి పంటను కొనుగోలు కేంద్రాలలో విక్రయించి లబ్ధి పొందాలని, రైతులు తాము తీసుకువచ్చే పత్తిలో నిబంధనలు పాటించాలని, 8 నుంచి 12 శాతం లోపు తేమ ఉండేలా చూసుకోవాలని, రైతులు తమ పంటను దళారీలకు తక్కువ ధరకు విక్రయించి మోసపోకుండా కొనుగోలు కేంద్రాలలో విక్రయించి లబ్ధి పొందాలని పేర్కొన్నారు.

కుట్టు మిషన్ అందజేత

నవతెలంగాణ-పెంచికల్ పేట్

నిషా జో ఫ్రీ, జోగేంద్రకుమార్ జోహ్రీ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వాహకుడు అమిత్ జోహ్రీ వాలంటరీ గడ్డం మహేష్‌తో కలిసి ఎల్కారు గ్రామానికి చెందిన కొడప శిరీషకు కుట్టుమిషన్‌ను అందజేశారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన స్వచ్ఛంద సంస్థ మారుమూల మండలాల్లని ఎంపిక చేయడం అభినందనీయమని మాజీ సర్పంచ్ రాజన్న అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భుజంగరావు, వాలంటీర్ రాజాగౌడ్ పాల్గొన్నారు.

వెడ్మ రాము వర్ధంతిని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-తిర్యాణీ

మండలంలోని ఏదులపాడు గ్రామంలో శనివారం నిర్వహించబోయే వేడ్మ రాము 37వ వర్ధంతి వేడుకలను విజయవంతం చేయాలని తోటి సంఘం జిల్లా అధ్యక్షుడు ఆత్రం సంతోష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఖానాపూర్ ఎమ్మెల్యే వేడ్మ బొజ్జు, ఐటీడీఏ పీఓ, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మీ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఆదివాసీ సంఘాల నాయకులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఖాతాదారులకు ఇబ్బందులు

నవతెలంగాణ-కౌటాల



మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో ఖాతాదారులకు కనిపించని జమ, చెల్లింపులు, నిల్వల విచారణ సూచికల బోర్డు ఖాతాదారులతోనే నడిచే బ్యాంకు, కాని ఇక్కడ కస్టమర్లకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఉదయం 10: 30 గంటల నుంచి ఎదురు చూసిన కనీసం బ్యాంక్ ఇంక్వైరీ చేయలేదు. ఏమయినా అడిగితే సర్వర్ డౌన్ ఉంది, లేకుంటే పక్క కౌంటర్‌లో అడుగు అని సమాధానం చెప్పారు. సంబంధిత ఉన్నత అధికారులు స్పందించి ఖాతా దారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఖాతా దారులు కోరారు.

పశుగణన సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

- అదనపు కలెక్టర్ దాసరి వేణు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో పశుగణన సర్వే ప్రక్రియను చేపట్టాలని అదనపు కలెక్టర్ దాసరి వేణు అన్నారు. శుక్రవారం తన ఛాంబర్‌లో జిల్లా పశు వైద్యాధికారి సురేష్ కుమార్, వైద్య అధికారులతో కలిసి 21వ అఖిలభారత పశుగణన-తెలంగాణ కార్యక్రమ గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 21వ అఖిలభారత పశుగణన-తెలంగాణ సర్వే కార్యక్రమం ఫిబ్రవరి 28, 2025 వరకు కొనసాగుతుందని, ఈ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. ప్రతి ఇంటికి వెళ్లి పశువుల వివరాలు సేకరించి ప్రభుత్వం నిర్ణయించిన ఆన్ లైన్ పోర్టల్‌లో ఎలాంటి పొరపాట్లు లేకుండా నమోదు చేయాలని తెలిపారు. జిల్లాలోని 15 మండలాలలో పశుగణన సర్వే కార్యక్రమం కొరకు 86 మంది ఎన్యుమరేటర్లు, 11 మంది సూపర్ వైజర్లను నియమించడం జరిగిందని, ఎలాంటి పొరపాట్లు లేకుండా సర్వే ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి డా విజయ్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

తలమడుగు : మండలంలోని భరంపూర్ గ్రామంలో 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమాన్ని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కిషన్, మాజీ డీసీసీబీ చైర్మన్ దామోదర్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పశు వైద్య సిబ్బంది ప్రతి ఇంటింటికి వెళ్లి పశుగణన సేకరిస్తారని. ఈ సందర్భంగా జడ్పీటీసీ పెళ్ళిన్న డాక్టర్ దూదేరామ్, కొత్తగా వచ్చిన డాక్టర్ లావణ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శేఖర్, పశు వైద్యుల సంఘం అధ్యక్షులు డాక్టర్ గోవింద్ నాయక్, గ్రామస్తులు కేదారేశ్వర్‌రెడ్డి, మల్లేష్, రంజిత్‌రెడ్డి, పశువైద్య సిబ్బంది సోమ్కు, విశాల్, సాయి ప్రసాద్, విజయ్ సుదర్శన్, గోపాల మిత్రులు పాల్గొన్నారు.

ఖాళీగా ఉన్న సర్ఫేస్ జనరల్ మజ్దూర్ పోస్టుల భర్తీ

నవతెలంగాణ-నస్పూర్



శ్రీరాంపూర్ ఏరియాలో ఉన్న 10 సర్ఫేస్ జనరల్ మజ్దూర్ ఖాళీలకు దరఖాస్తు చేసుకున్న మెడికల్ ప్రాబ్లమ్స్ ఉన్న ఉద్యోగులకు ఎస్ఓ టూ జీఎం సత్యనారాయణ ఆధ్వర్యంలోని కమిటీ వారితో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా దరఖాస్తుదారులు తమ మెడికల్ రిపోర్టులతో పాటు వ్యక్తిగతంగా కమిటీ ముందు హాజరయ్యారు. శుక్రవారం నిర్వహించిన కౌన్సిలింగ్‌లో 152 మందికి గాను 94 మంది పాల్గొన్నారు. మూడు రోజులలో నిర్వహించే కౌన్సిలింగ్‌కు మొత్తం 435 మందికి 281 మంది హాజరుకాగా వారిని వైద్యులు, కమిటీ వారు పరిశీలించి అర్హులైన 10 మందిని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో డీజీఎంలు పి అరవింద రావు, చిరంజీవులు, డీవై సీఎంఓ డాక్టర్ పి రమేష్ బాబు, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ సమీరా సంధాని పాల్గొన్నారు.

విధుపట్ల నిర్లక్ష్యం వహించిన శిక్షణ అధికారి సస్పెండ్

నవతెలంగాణ-జన్నారం

కవ్వాల పులుల అభయారణ్యంలోని జన్నారం రేంజ్ పరిధిలోని అల్లీనగర్ ఫారెస్ట్ సెక్షన్ అధికారి కిరణ్మయి జ్యోతి విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ నెల 9వ తేదీన అల్లీనగర్ గ్రామానికి చెందిన ఆత్రం నగేష్ ఇంట్లో ముందస్తు సమాచారం మేరకు రూ.54 వేల విలువైన అక్రమ టేకు కలపను స్వాధీనం చేసుకున్నారు. ఈ అక్రమ కలపను పట్టుకున్న వ్యవహారంలో ఆ సెక్షన్ అధికారి అధికారి కిరణ్మయి జ్యోతిపై పలు ఆరోపణలు రావడంతో ఉన్నతాధికారులు విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని మంచిర్యాల ఫ్లయింగ్ స్క్వాడ్ రేంజ్ అధికారిణి రమాదేవిని ఆదేశించారు. ఆ నివేదిక ఆధారంగా సెక్షన్ అధికారిని సస్పెండ్ చేసినట్లు డీఎఫ్ఓ, స్థానిక ఇన్‌ఛార్జ్ ఎఫ్‌డీఓ శివ ఆశిష్ సింగ్ తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు అచలాపూర్ విద్యార్థిని



నవతెలంగాణ-తాండూర్

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు జడ్పీహెచ్ఎస్ అచలాపూర్ పాఠశాల విద్యార్థిని ఎంపికైనట్లు పీడీ ఏ సాంబమూర్తి తెలిపారు. ఈ నెల 24న నిర్మల్ జిల్లా గుండంపల్లి లో జరిగిన ఎస్‌జీఎఫ్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి అండర్ -17 ఇయర్స్ గర్ల్స్ వాలీబాల్ టోర్నమెంట్‌లో మంచిర్యాల జట్టు రెండవ స్థానం కైవసం చేసుకుంది. జట్టులో తాండూరు మండలం అచులపూర్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న యం అమూల్య మంచిర్యాల జిల్లా తరుపున ప్రాతినిధ్యం వహించి అంత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం జరిగినదని తెలిపారు. ఈ నెల 28 నుండి 30 వరకు పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో జరుగబోయే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి అండర్-17 ఇయర్స్ బాల బాలికల వాలీబాల్ ఛాంపియన్ షిప్‌లో విద్యార్థిని పాల్గొననున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి ఉమదేవి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఫణి రాజ, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ చిలుకమ్మ, అచులాపూర్ గ్రామ పెద్దలు విద్యార్థిని అభినందించారు.

విశ్రాంత ఉద్యోగుల సమావేశం

నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలోని వయోవృద్ధుల సంక్షేమ భవనంలో మండల రిటైర్డ్ ఉద్యోగుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో రిటైర్డ్ తహసీల్దార్ కే రాజన్న, రిటైర్డ్ ఉద్యోగుల సెంట్రల్ కౌన్సిల్ మెంబర్ మొండయ్య, రిటైర్డ్ ఉద్యోగులకు పలు సూచనలు సలహాలు అందించారు. సైబర్ నేరాలు అరికట్టుట, వయోవృద్ధులపోషణ చట్టం నిబంధనల గురించి అవగాహన కల్పించారు. చట్టం 2007, 2011 నిబంధనలపై రిటైర్డ్ ఉద్యోగులకు తెలిపారు. సైబర్ నేరాలకు లోబడేది ముఖ్యంగా సెనియర్ సిటిజన్స్ తగు జాగ్రత్తలు గురించి తెలియజేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగులు, శ్యాంకుమార్(స్టేట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ హెల్పేజ్ ఇండియా), కస్తూరి నాగేశ్వర్ విశ్రాంత ఉద్యోగుల సంఘం జెనరల్ సెక్రటరీ, గోపి సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ దేవయ్య, కూకటికారి బుచ్చయ్య, రిటైర్డ్ తహసీల్దార్ రాజయ్య, జి మురళి, తారచంద్, ఏం భాస్కర్, లచ్చన్న, పుల్లయ్య, టీ రాజం, ఎన్ సత్తెన్న, వివిధ గ్రామాలకు చెందిన రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

నవతెలంగాణ-దండేపల్లి

ఉపాధ్యాయుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) రాష్ట్ర అదనపు కార్యదర్శి బండి రమేష్ డిమాండ్ చేశారు. మండలంలోని రెబ్బెనపల్లి, దండేపల్లి, ద్వారక, వెలగనూరు పాఠశాలలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదు పత్రాలను అందించి ఆయన మాట్లాడారు. చాల కాలంగా పెండింగ్‌లో ఉన్న జీపీఎఫ్, డీఏ, పీఆర్సీ, మెడికల్ రీయంబర్స్మెంట్, సరెండర్ లీవ్, తదితర పెండింగ్ బిల్లుల విడుదల చేయాలని కోరారు. రాష్ట్రంలో నూతనంగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా డీఏ, పీఆర్సీ, పెండింగ్ బిల్లులు పరిష్కారమవుతాయని పదినెలలుగా ఎదురుచూసిన సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదన్నారు. 50 శాతం ఫిట్ మెంట్‌తో పీఆర్సీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పీఆర్సీ నివేదికను తెప్పించుకోవడం పట్ల తాత్సారం ప్రదర్శిస్తుందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నిలేష్ కుమార్, మండల అధ్యక్షుడు ఉప్పల రూపాచారి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు రాజేందర్, ఉమా పాల్గొన్నారు.

మాలల హక్కులు సాధనకు పోరాడుతాం

నవతెలంగాణ నస్పూర్



మాలల హక్కులు సాధించే వరకు పోరాడుతామని జై భీమ్ సైనిక్ దళ్ మంచిర్యాల నియోజకవర్గ అధ్యక్షుడు కాటం రాజు అన్నారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ అక్టోబర్ 25 నుంచి సెప్టెంబర్ 1 వరకు భద్రాచలం నుంచి హైదరాబాద్ వరకు చేస్తున్న పాదయాత్రలో జై భీమ్ సైనిక్ దళ్ జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ప్రభుత్వాలు చేపడుతున్న ఎస్సీ వర్గీకరణ ఆపాలని, లేకుంటే రానున్న రోజుల్లో నిరసన కార్యక్రమాలను ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల పట్టణ అధ్యక్షుడు దొంతమల్ల శివ, నస్పూర్ పట్టణ అధ్యక్షుడు బింగి సదానందం పాల్గొన్నారు.

మంచి భవిష్యత్తుకు బాటలు వేయాలి



నవతెలంగాణ-జైపూర్

10వ తరగతి పూర్తి చేసుకుని ఇంటర్మీడియట్‌లో చేరిన విద్యార్థులు భవిష్యత్ ప్రణాళికలతో భవిష్యతుకు బాటలు వేయాలని స్థానిక అదనపు ఎస్ఐ నాగరాజు సూచించారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇంటర్మీడియట్ వయస్సులో విద్యార్థులు చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. ప్రతి విషయంలో ఆచీతూచీ మంచి మార్గంలో నడుచుకోవాలని తెలిపారు. గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, కేవలం విద్యాభ్యాసం తప్పా మరో ఆలోచనా లేకుండా ముందుకు సాగాలని తెలిపారు. సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన కళాబృందం సభ్యులు పోలీసు శాఖ విధులను వివరించారు.

పెండింగ్ స్కాలర్షిప్స్ విడుదల చేయాలి

● ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు దాగం శ్రీకాంత్

నవతెలంగాణ-మందమర్రి



పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు దాగం శ్రీకాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్ఎఫ్ఐ మందమర్రి మండల కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని విద్యార్థులతో కలిసి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి వినతి పత్రం అందజేశారు. ముఖ్య అతిథిగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు దాగం శ్రీకాంత్ హాజరయ్యారు. మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాల నుంచి విద్యార్థులకు రావలసిన స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ రాష్ట్రంలో రూ.8000 కోట్లకు పైగా పెండింగ్‌లో ఉందన్నారు. దీనివలన పేద మధ్య తరగతి విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ముఖ్యంగా ప్రయివేట్ కళాశాలలో చదువుకునే విద్యార్థులు వాళ్ళ చదువు పూర్తి చేసుకుని పై చదువులు చదవాలంటే స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ రాలేదు కాబట్టి డబ్బులు చెల్లించి సర్టిఫికెట్లను తీసుకెళ్లాలని విద్యాసంస్థలు అంటున్నాయి. ఫీజులు కట్టలేక పై చదువులకి పోలేక విద్యని మధ్యలో ఆపాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ప్రభుత్వం వెంటనే స్పందించి స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో మందమర్రి మండల కమిటీ సభ్యులు శ్రీహరి, దాసరి రిషి, జయంత్, రేశ్వంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

లేబర్ సైట్‌ను వెంటనే పునరుద్ధరించాలి



నవతెలంగాణ-తాండూరు

అడ్డ కూలీల కష్టాలు తీర్చాలని, లేబర్ సైట్‌ను వెంటనే పునరుద్ధరించాలని ఏఐటీయూసీ, ఎంసీపీఐ(యూ) ఆధ్వర్యంలో బెల్లంపల్లి చౌరస్తా వద్ద అసంఘటిత కార్మికులతో పెద్ద ఎత్తున రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ మాట్లాడారు. గత 2 నెలలుగా కార్మిక శాఖకు చెందిన ఆన్‌లైన్ సైట్ పనిచేయక పోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. చాలా మంది కొత్త కార్డులకు దరఖాస్తు చేసుకోలేక పోతున్నారని, కార్డు ఉన్నవారి సమయం కావడంతో రినివల్ కావడంలేదన్నారు. కార్మికులకు కార్మిక శాఖ నుంచి రావాల్సిన డెత్, బర్త్, మ్యారేజ్ బెనిఫిట్స్ అందడం లేదని వాపోయారు. శాఖలకు సంబంధించిన అధికారులకు ఎన్నో సార్లు వినతిపత్రాలు అందించినా స్పందన లేదన్నారు. కార్మిక శాఖ మంత్రి, కమీషనర్ వెంటనే స్పందించి కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. లేనియెడల పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రజా సంఘాల నాయకులు ఆరెపల్లి రమేష్, రామకృష్ణ, సతయ్య, శంకర్, రాజయ్య పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

● మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

నవతెలంగాణ-జైపూర్



ప్రభుత్వ ఆస్పత్రులలకు వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం కోటపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అకస్మికంగా సందర్శించిన ఆయన రికార్డులు పరిశీలించారు. అదేవిధంగా ఆస్పత్రి పరిసరాలు అందుబాటులో ఉన్నటువంటి మందుల నిల్వలు పరిశీలించారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ అత్యవసరమైన మందులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రభలకుండా పాటించవల్సిన జాగ్రత్తలు గ్రామీణులకు వివరించాలని తెలిపారు. వైద్యులు, సిబ్బంది విధుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందిచంచాలని తెలిపారు. అదేవిధంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని సంధర్శించిన కలెక్టర్ రికార్డులు పరిశీలించారు. వివిధ రకాల ధ్రువపత్రాల కొరకు వచ్చే ధరఖాస్తులను నిర్ణీత గడువులో నిబంధనల ప్రకారం జారీ చేయాలన్నారు. ధరణీ పోర్టల్‌లో అందిన ధరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి రికార్డులను సరి చూసి త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సంధర్శించి పంచాయతీ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. నర్సరీని సంధర్శించి మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాల-వసతీ గృహం, కస్తూరిబా పాఠశాల, షెడ్యూల్డ్ కులాల సంక్షేమ బాలుర వసతీ గృహం, తెలంగాణ మోడల్ హైస్కూల్, జూనియర్ కళాశాలను సందర్శించారు.

కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలను వెంటనే పెంచాలి

నవతెలంగాణ-నస్పూర్



కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలను వెంటనే పెంచాలని సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్ అన్నారు. గురువారం ఆర్కే-7 గనిలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో వారు పాల్గొని మాట్లాడారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలపై యాజమాన్యం వెంటనే నిర్ణయం తీసుకొని అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా గత సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) చేస్తున్న పోరాట ఫలితంగా గత నెల కార్మికులకు సింగరేణికి వచ్చిన లాభాల నుండి లాభాల వాటాగా కాంట్రాక్టు కార్మికులకు రూ.5 వేలు గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ ఒత్తిడి మేరకు యాజమాన్యం చెల్లించిందన్నారు. సింగరేణి కాంట్రాక్టు కార్మికుల వేతనాలను పెంచడానికి అటు రాష్ట్ర ప్రభుత్వం ఇటు గుర్తింపు కార్మిక సంఘం సానుకూలంగా ఉన్నప్పటికీ సింగరేణి యాజమాన్యం మీనమేషాలు లెక్కిస్తుందన్నారు. అదేవిధంగా 2022లో యాజమాన్యంతో కార్మిక సంఘాలకు జరిగిన ఒప్పందాలను అమలు చేయాలన్నారు. వెంటనే యాజమాన్యం స్పందించి కార్మికుల వేతనాలు పెంచడానికి నిర్ణయం తీసుకోవాలని లేని పక్షంలో సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో భవిష్యత్ ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవీందర్, భరత్, శ్రీనివాస్, నర్సింగ్గం, ఆదిత్య, దిలీప్, వెంకటేష్, రాజు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో అత్యాధునిక సౌకర్యాలు



నవతెలంగాణ-తాండూర్

ప్రభుత్వం మహిళ శిశు సంక్షేమ శాఖ ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రైవేట్ ప్లే స్కూల్ మాదిరిగా అత్యధిక సౌకర్యాలను కల్పిస్తుందని బెల్లంపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ జక్కుల శ్వేత తెలిపారు. శుక్రవారం బెల్లంపల్లి పట్టణంలోని 11వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పనితీరు పౌష్టికాహార పంపిణీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీలను ఆధునీకరించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. బెల్లంపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో మొత్తం 279 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా బెల్లంపల్లి పట్టణంలోని 18 అంగన్‌వాడీలో పెయింటింగ్ వర్ణ చిత్రాల కోసం ఒక్కొక్క స్కూల్‌కి రూ.36 వేలు మంజూరయ్యాయని తెలిపారు. పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆహ్లాదకర వాతావరణంలో సంతోషంగా ఆడుకునే విధంగా అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వం తయారు చేస్తుందని తెలిపారు. పట్టణ ప్రజలు అంగన్‌వాడీ సేవలను వినియోగించుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, పిల్లలకు ఉచితంగా పౌష్టిక ఆహారం అందిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ మాధవి పాల్గొన్నారు.

28న స్థానిక సంస్థల రిజర్వేషన్లకు విచారణ

నస్పూర్ : స్థానిక సంస్థల వారిగా రిజర్వేషన్ల కల్పనకు ఈ నెల 28న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని జడ్పీ సమావేశ మందిరంలో బహిరంగ విచారణ నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల వారిగా కల్పించవలసిన రిజర్వేషన్లు ప్రకటించే విషయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాలకు 50 శాతం రిజర్వేషన్ మించకుండా తెలంగాణ వెనుకబడిన తరగతుల కమీషన్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలోని వెనుకబడిన తరగతుల కులములు, వెనుకబడిన తరగతుల కుల సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, ఆసక్తి గల అభ్యర్థుల నుంచి, పార్టీల నుంచి అభ్యర్థనలు, సలహాలు, ఆక్షేపణలను స్వీకరించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ విచారణకు ఉమ్మడి జిల్లాలోని పార్లమెంట్ సభ్యులు, శాసన మండలి సభ్యులు, శాసనసభ్యులు, మున్సిపల్ చైర్మన్, ప్రజాప్రతినిధులతో పాటు జిల్లాలోని బీసీ సంఘ నాయకులు, ప్రతినిధులు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ నాయకులు హాజరై తమ సమర్పణలు, అభ్యర్థనలు, సలహాలు, ఆక్షేపణలను రూ.20 విలువ గల నాన్-జుడిషియల్ బాండ్ పేపర్‌పై ప్రమాణ పత్రమును ప్రభుత్వ నోటరీ అడ్వకేట్ సంతకముతో తమ ఆక్షేపణలను 6 ప్రతులను జత చేసి సమర్పించాలని తెలిపారు.

వృద్ధులకు దుస్తులు పంపిణీ

నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లా కేంద్రంలోని సాయి అందుల పాఠశాలలో ఉన్న వృద్ధులకు శుక్రవారం మంచిర్యాలకు చెందిన మమత మహిళ తరంగిని ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. వాటితో పాటు నిత్యావసర వస్తువులు అందించారు. వృద్ధులకు టపాకాయలు, స్వీట్లు పంచి ముందస్తు దీపావళి సంబరాలు నిర్వహించారు. మమత తరంగిని సభ్యులు రాచకొండ మంజుల, లీల, నాగమని పాల్గొన్నారు.

అవార్డు అందుకున్న హరిత మేనేజర్

నవతెలంగాణ-జన్నారం

రాష్ట్ర టూరిజం శాఖ ఆధ్వర్యంలో అందజేసిన అవార్డుల ప్రధానోత్సవంలో జన్నారం హరిత రిసార్ట్స్ మేనేజర్ ఎస్.వీరేంద్రకుమార్ ఎక్సలెంట్ అవార్డును అందుకున్నారు. విధి నిర్వహణలో ఉత్తమ సేవలకుగాను హైదరాబాదులోని హరిత రిసార్ట్స్ హెడ్ ఆఫీసులో రాష్ట్ర టూరిజం శాఖ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.ప్రకాష్‌రెడ్డి శుక్రవారం ఎక్సెంట్ అవార్డును, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. అవార్డు అందుకున్న ఆయనను పలువురు అభినందించారు.

మృతుడి కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-వేమనపల్లి

మండలంలోని నీల్వాయి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త దుర్గం సుధాకర్ తాత దుర్గం బిక్కయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, వారి కుటుంబ సభ్యులను బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వారి వెంట మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు కోలి వేణు మాధవ్ రావు, ఈ కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ కుబిడే వెంకటేశం, మాజీ జడ్పీటీసీ తలండి భీమయ్య, సీనియర్ నాయకులు పురాణం లక్ష్మీ కాంత్, మాజీ సర్పంచులు రుద్రబట్ల లక్ష్మీ నారాయణ, బొర్కుటి సంతోష్, గొంతు మేర, కొండగొర్ల బాపు పాల్గొన్నారు.

మహిళా బదిలీ వర్కర్లు, జనరల్ మజ్దూర్లకు కౌన్సెలింగ్

నవతెలంగాణ-కాసిపేట

మందమర్రి ఏరియాలోని కాసిపేట-1వ గనిలో మహిళ బదిలీ వర్కర్లు, జనరల్ మజ్దూర్లకు సర్ఫేస్‌లో గల వివిధ 16 డెసిగ్నేషన్లో ఉద్యోగాలకై కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఓ టూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ మహిళ బదిలీ వర్కర్లు, జనరల్ మజ్దూర్లు ఎంచుకున్న ఉద్యోగాలకు అనుగుణంగా తగిన శిక్షణ అందించిన తర్వాత సంబంధిత ఉద్యోగాలకు పంపించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని మహిళ బదిలీ వర్కర్లు, జనరల్ మజ్దూర్‌లు ఉపయోగించుకోవాలని సూచించారు. కౌన్సిలింగ్ కమిటీ సభ్యులు ఎస్ఓ టూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, డీజీఎం ఐఈడీ రాజన్న, డాక్టర్ ఎం జయవాణి ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేకే గ్రూప్ ఏజెంట్ వి.రామదాసు, కాసిపేట గని మేనేజర్ భూ శంకరయ్య, సంక్షేమాధికారి మీర్జా గౌస్, జీషా పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై కొనసాగిన విచారణ



నవతెలంగాణ-జైపూర్

జైపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నిధుల దుర్వినియోగం అయినట్లు అందిన పిర్యాదు మేరకు రిజిస్టార్ విచారణ చేపట్టారు. సహకార సంఘం అధ్యక్షుడు గుండు తిరుపతి రూ.86 వేలు దుర్వినియోగం చేశారని ఉపాధ్యక్షుడు సంతోషం చంద్రశేకర్ ద్వార అందిన పిర్యాదు మేరకు శుక్రవారం విచారణ చేపట్టారు. పిర్యాదుదారుడైన చంద్రశేఖర్ సమక్షంలో సహకారం సంఘం జమ ఖర్చుల రికార్డులతో పాటు ఇతర రికార్డులు పరిశీలించారు. విచారణకు సంబందించిన నివేదికలు సంబంధిత డీసీఓ కార్యాలయంలో సమర్పించనున్నట్లు తెలిపారు.

దండారి దర్బార్ వాల్ పోస్టర్ల విడుదల

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని సల్పలవాగు సమీపంలోని వెంకటాద్రి గుడిలో ఈ నెల 27న నిర్వహించే ఆదివాసీ దండారి దర్బార్ వాల్ పోస్టర్లను ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో విడుదల చేశారు. తహసీల్దార్ భోజన్న చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో దండారీ దర్బార్ నిర్వాహణ కమిటీ అధ్యక్షుడు అడె జంగు, వర్కింగ్ ప్రెసిడెంట్లు పెంద్రం హన్మంతు, వెడ్మ కిషన్, గౌరవ అధ్యక్షుడు సిడాం రాందాస్, ప్రచార కార్యదర్శి ఆత్రం జంగు, సిడాం సీతారాం పాల్గొన్నారు.

అట్టహాసంగా ఎంజేపీ క్రీడలు

నవతెలంగాణ-లక్షెట్టిపేట

లక్సెట్టిపేట మహాత్మ జ్యోతిబా పూలె బాయ్స్ పాఠశాల ఆవరణలో గత రెండు రోజులుగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి క్రీడలు అట్టహాసంగా కొనసాగాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ రోనాల్డ్ కిరణ్ మాట్లాడుతూ వివిధ ప్రాంతాల ఎంజేపీ బాయ్స్ స్కూల్స్‌కు చెందిన విద్యార్థులు క్రీడల్లో పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నల్మాస్ కాంతయ్య, వైస్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, స్థానిక కౌన్సిలర్, ఆర్‌సీఓ గోపీచంద్, డీసీఓ శ్రీధర్ పాల్గొన్నారు. గెలిచిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు.

ఆత్మహత్యకు పాల్పడిన మహిళ మృతి

నవతెలంగాణ-జైపూర్

భీమారం మండల కేంద్రానికి చెందిన మచ్చ విజయలక్ష్మి(32) ఆత్మహత్యకు పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. భర్త మచ్చ నరేష్‌తో గొడవపడిన విజయలక్ష్మి గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా గుర్తించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ఆస్పత్రికి తరలించగా శుక్రవారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. భీమారం మండలం కొర్విచెల్మ గ్రామానికి చెందిన విజయలక్ష్మిని గత 12 సంవత్సరాల క్రితం మచ్చ రమేష్‌తో వివాహం అయింది. మృతురాలికి ఒక కూతురు అక్షిత(10) ఉంది.

గుస్సాడీ కళాకారుడు పద్మశ్రీ కనక రాజు కన్నుమూత

నవతెలంగాణ-దహెగాం



ఆసిఫాబాద్ జిల్లా, జైనూర్ మండలం మార్లవాయి గ్రామానికి చెందిన పద్మశ్రీ అవార్డు గ్రహీత, గుస్సాడీ నృత్య కళాకారుడు కనక రాజు శుక్రవారం అనారోగ్యంతో కన్నుశారు. ఈయన ఆదివాసీ సంస్కృతి, సాంప్రదాయాలకు గుర్తింపు తెచ్చాడు. గుస్సాడీ నృత్యాన్ని ప్రదర్శిస్తూ, నేర్పుతూ దేశవ్యాప్తంగా గుర్తింపు పొందారు. కనక రాజుకు కేంద్ర ప్రభుత్వం 2021నవంబర్ 9న పద్మశ్రీ పురస్కారాన్ని ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో అందుకున్నారు. ఆయన అంత్యక్రియలు స్వగ్రామం మార్లవాయిలో శనివారం ఆదివాసీ సాంప్రదాయం ప్రకారం నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

నర్సరీ పనుల్లో వేగం పెంచాలి

నవతెలంగాణ-నార్నూర్



గ్రామాల్లో నర్సరీని ఏర్పాటు చేసి పనులను వేగం పెంచాలని డిఎల్పిఓ గంగాధర్, మండల ప్రత్యేక అధికారి ప్రభాకర్ అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాది హామీ టీఏ, గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. గడువులోగా గ్రామాల్లో వంద శాతం ఇంటి పన్ను వసూలు చేయాలని కార్యదర్శులకు సూచించారు. పారిశుధ్యం, క్లోరినేషన్‌తో పాటు గ్రామాల్లో చేపట్టబోయే పనుల్లో నిర్లక్ష్యం వహించవద్దన్నారు. సమావేశంలో ఎంపీడీఓ జవహర్ లాల్, ఎంపీఓ స్వప్న షీలా, ఏపిఓ జాదవ్ సురేష్, ఈసీ సురేందర్ ఉన్నారు.

ఆత్మగౌరవ పోరాటాలకు ప్రేరణ కుమురంభీం

నవతెలంగాణ-సిరికొండ

ఆదివాసుల ఆత్మగౌరవ పోరాటాలకు నిత్య ప్రేరణ కొమురం భీం అని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని రాయిగూడ గ్రామంలో భీం విగ్రహాన్ని ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యురాలు నీలాదేవితో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జల్ జంగల్ జమీన్ కోసం ఎన్నో పోరాటాలు చేసిన గొప్ప మహనీయుడు కొమురం భీం అని అన్నారు. ఆదివాసుల సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేశాడని తెలిపారు. గత ప్రభుత్వం ఆ మహనీయుడి పేరు మీద గిరిజన అస్తిత్వాన్ని చరిత్రలో నిలిచేవిధంగా జోడేఘాట్‌లో మ్యూజియం ఏర్పాటు చేసిందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, వివిధ గ్రామల పటేళ్లు, సార్మెడీలు పాల్గొన్నారు.

ఉట్నూర్ : కుముం సూరు 27వ వర్ధంతిని శుక్రవారం కొలాంగూడ, దంతన్‌పల్లిలో నిర్వహించారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి కుష్బూ గుప్తా సూరు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సూరు చూపిన మార్గంలో ఆదివాసులు నడవాలని తెలిపారు. పీఓ మాట్లాడుతూ ఐటీడీఏ ద్వారా వచ్చే పథకాలను గిరిజన లబ్దిదారులకు సకాలంలో అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీఓ(పివిటిజి) మెస్రం మనోహర్, ఆదివాసీ సంఘ నాయకులు, కొలాం సేవా సంఘం నాయకులు పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయ మూర్తిని కలిసిన సీపీ

నవతెలంగాణ-జైపూర్

పలు ప్రారంభోత్సవాలకు హాజరు అయ్యేందుకు వచ్చిన హైకోర్టు న్యాయమూర్తి వేణుగోలపాల్‌ను శుక్రవారం రామగుండం సీపీ శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. జైపూర్ ఎస్టీపీపీ అతిథిగృహంలో కలిసి పుష్పగుచ్ఛాని అందజేశారు. ఆయన వెంట మంచిర్యాల డీసీపీ ఎ భాస్కర్ ఉన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేసిన ఎస్ఐ

నవతెలంగాణ-జన్నారం

మండలానికి చెందిన కస్తూరి శ్రీకాంత్ పోగొట్టుకున్న ఫోన్ను సీఈఐఆర్ పద్ధతి ద్వారా కనిపెట్టి స్థానిక ఎస్ఐ రాజా వర్ధన్ తిరిగి శుక్రవారం అప్పగించారు. శ్రీకాంత్ ఈ నెల 6న మంచిర్యాల జిల్లా కేంద్రం నుంచి జన్నారం వస్తూ ఉండగా మార్గమధ్యలో మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నారు. ఆయన ఫిర్యాదు మేరకు పోలీసులు సీఈఐఆర్ పద్ధతి ద్వారా ఆ ఫోన్ను కనిపెట్టి స్వాధీనం చేసుకున్నారు. పోలీస్‌స్టేషన్ శ్రీకాంత్‌కు ఎస్ఐ ఫోన్ను అందించారు.

డీఎస్సీలో ఉపాధ్యాయ ఉద్యోగం సాధించిన సుస్మితకు సన్మానం

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని వినాయకనగర్ కాలనీకి చెందిన సల్లా శంకర్ గౌడ్ లావణ్య చిన్న కుమార్తె సల్లా సుస్మిత ఇటీవల ప్రకటించిన డీఎస్సీలో టీచర్ ఉద్యోగం సాధించిన సల్ల సుస్మితకి వినాయకనగర్ కాలనీ వినాయక మండలి తరఫున ఘనంగా శాలువాలతో పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా వినాయకనగర్ మండల వాసులు గుర్రం మోహన్‌రెడ్డి మాట్లాడుతూ, చిన్నతనం నుంచే విద్యార్థులు కష్టపడి చదివితే మంచి ఉద్యోగాలు సాధించవచ్చు అన్నారు. చదువును మించిన ఆయుధం లేదని సూచించారు. ఈ సన్మాన కార్యక్రమంలో వినాయకనగర్ వినాయక మండలి వాసులు గుర్రం మోహన్‌రెడ్డి, సుజాత, అప్పాల అంజన్న, నవిత, పయ్యావుల రాము, సురేఖ మామిడిపల్లి, హరికష్ణ, రమేష్, మసూద్, సరిత, వీణ పాల్గొన్నారు.

సీసీఐ పూర్తిస్థాయిలో పత్తి కొనుగోలు చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పత్తి సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతుల వద్ద నుంచి పూర్తిస్థాయిలో పత్తిని సిసిఐ కొనుగోలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్నర్ రమేష్ డిమాండ్ చేశారు. అదనపు కలెక్టర్ దాసరి వేణుని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పత్తికి కనీస మద్దతు ధర రూ.12000 ఇవ్వాలన్నారు. జిల్లాలో ఎక్కువ శాతం రైతులు పత్తి పంట వేస్తారని, అధిక వర్షాలు కూలీల దొరుకుపోవడంతో రైతులకు పెట్టుబడి పెరిగిందన్నారు. దీనిని గమనించి కనీసం మద్దతు ధర రూ.12000గా నిర్ణయించాలని డిమాండ్ చేశారు.

కొనసాగుతున్న టీఎస్‌టీటీఎఫ్ సభ్యత్వ నమోదు

నవతెలంగాణ-ఉట్నూర్

టీఎస్‌టీటీఎఫ్ సభ్యత్వం నమోదు మండలంలో ముమ్మరంగా కొనసాగుతోంది. శుక్రవారం ఉట్నూర్ మండలంలో టీఎస్‌టీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జిల్లా నాయకులు రాథోడ్ దినేష్, దేవిదాస్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా టీఎస్‌టీటీఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జాదవ్ చంద్రకాంత్ నాయక్ మాట్లాడుతూ జరుగబోయే మంత్రివర్గ సమావేశంలో ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఉద్యోగులకు రావాల్సిన డీఏలను వెంటనే ప్రకటించాలన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు ఉద్యోగులకు హెచ్‌ఆర్ఏ పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన ఉపాధ్యాయులు, మండల నాయకులు జాదవ్ మోహన్, రాథోడ్ దేవిదాస్, రాథోడ్ ప్రకాష్, జాదవ్ విఠల్, పవర్ చైతన్య, కృష్ణ, రాథోడ్ దినేష్, సుకేందర్, సంగీత పాల్గొన్నారు.

ఆదివాసి గూడెల్లో ప్రారంభమైన భోగి సందడి

నవతెలంగాణ-ఉట్నూర్

ఆదివాసులు తమ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతిరూపంగా భోగి పండుగను జరుపుకుంటారు. వారి పండుగలలో ముఖ్యమైన పెద్ద పండుగ దీపావళి. వారం రోజుల పాటు ఈ పండుగను ఘనంగా నిర్వహించుకుంటారు. అందులో భాగంగానే శుక్రవారం మండలంలోని మత్తడిగూడా గ్రామంలో గ్రామ పటేల్ సిడం సోనేరావు, జంగుదేవ, తుడుం దెబ్బ జిల్లా ఉపాధ్యక్షులు దండారి భోగి పండుగ సందర్భంగా ఎత్మాసూర్ పెన్‌కి పూజలు నిర్వహించారు. గుస్సాడి వస్తువులను ముందుగా పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంద్ర మాణిక్‌రావు, రామ్‌శావ్, కనక లచ్చు, జంగు, మహిళలు పాల్గొన్నారు.

మాతృత్వ మరణాలు తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్

నవతెలంగాణ-నిర్మల్



జిల్లాలో మాతృత్వ మరణాలు తగ్గించేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ వైద్యాధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో మాతృత్వ మరణాల నియంత్రణపై వైద్యారోగ్యశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. మాతృ మరణాలను నిరోధించడానికి తన అధ్యక్షతన సంబంధిత అధికారులతో హైపవర్ కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. దీపావళి తర్వాత ఈ హైపవర్ కమిటీ ఆధ్వర్యంలో సమస్యాత్మక ప్రాంతాలలో గర్భిణుల జాబితాను సిద్ధం చేసి, దానికి అనుగుణంగా ఎక్కువ గర్భిణులు ఉన్న ప్రదేశాలలో ఏఎన్‌ఎంల సంఖ్యను పెంచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గర్భం దాల్చిన వెంటనే మహిళలకు పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్య స్థితిని నమోదు చేయాలన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో హైరిస్క్ గర్భస్థ మహిళలను గుర్తించి, దానికి అనుగుణంగా చికిత్స తీసుకునే విధంగా వారిని ప్రోత్సహించాలన్నారు. గర్భిణులకు పోషకాహార ఆవశ్యకతపై అవగాహన కల్పించాలన్నారు. హైరిస్క్ గర్భిణులపై నిరంతర పర్యవేక్షణ ఉంచి, ఎప్పటికప్పుడు వారి ఆరోగ్య స్థితిని తెలుసుకుంటూ అవసరమైన వైద్య చికిత్సలు అందించాలని సూచించారు. హైరిస్కు గర్భిణులను గుర్తించేందుకు గ్రామీణ స్థాయిలో ఏఎన్ఎం, ఆశా, అంగన్వాడి సిబ్బందికి అవసరమైన శిక్షణ ఇవ్వాలన్నారు. సమావేశంలో డిఎంహెచ్ఓ డాక్టర్ రాజేందర్, వైద్యాధికారులు సురేష్, సౌమ్య పాల్గొన్నారు.

కాళేశ్వరం 27వ ప్యాకేజీ పనులు గడువులోగా పూర్తి చేయాలి

కాళేశ్వరం ప్రాజెక్టు 27వ ప్యాకేజీ పనులను నిర్దిత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో నీటి పారుదల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు 27వ ప్యాకేజీ పథకంలో భాగంగా లక్ష్మీనరసింహ ఎత్తిపోతల పథకానికి సంబంధించి పనుల పురోగతి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనుల్లో ఎటువంటి అలసత్వం వహించకుండా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ వివరాలను మండలాల వారీగా అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో నీటిపారుదల శాఖ ఎస్ఈ రవీందర్, ఈఈ అనిల్, డిప్యూటీ ఈఈ నరేష్ కుమార్, ఏఈఈలు మీరాజుద్దీన్, గంగాధర్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్ ఎమ్మెల్యే కారుకు ప్రమాదం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ కారుకు ప్రమాదం జరిగింది. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి వద్ద ఈ ప్రమాదం చోటు చేసుకుంది. శుక్రవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ వైపు వస్తుండగా వెనుక నుంచి ఓ లారీ ఢీకొట్టగా ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో కారుకు స్వల్పంగా డ్యామేజ్ అయింది. కాగా ఎమ్మెల్యేకు అతి స్వల్పంగా గాయాలతో సురక్షితంగా బయటపడ్డారు.

ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-బోథ్

మండలంలోని సొనాల గ్రామంలోని శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. రెండు రోజుల కింద జిల్లా కేంద్రంలోని రైతు పోరు యాత్రలో కేటీఆర్ ఉన్నది ఉన్నట్టుగా మాట్లాడినా కాంగ్రెస్ నాయకులు కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేయడం చాలా బాధాకరమన్నారు. దీనికి నిరసనగా సీఎం దిష్టిబొమ్మ దహనం చేశారు. అలాగే రాష్ట్రంలో రైతుబంధు, రుణమాఫీ, ఇవ్వకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి రైతులకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

తలమడుగు : మోసపూరిత హామీలతో ప్రజలను, రైతులను సీఎం రేవంత్‌రెడ్డి మోసం చేశారని శుక్రవారం మండలంలోని సుంకిడి గ్రామంలో అంబేద్కర్ చౌక్ వద్ద సీఎం రేవంత్‌రెడ్డి బొమ్మను తాంసి, తలమడుగు, భీంపూర్ మండలాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు దహనం చేశారు. ఈ సందర్భగా వారు మాట్లాడారు. రుణమాఫీ, కళ్యాణలక్ష్మి, తులం బంగారం, బతుకమ్మ చీరలు, సైతం పంపిణీలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసేందుకు బీఆర్ఎస్ నాయకులు ప్రయత్నించగా, తలమడుగు, తాంసి, పోలీసులు అడ్డుకున్నప్పటికీ ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తోట వెంకటేష్, మొట్టె కిరణ్ కుమార్, అబ్దుల్లా, వామన్, జనార్ధన్, ఆశన్న యాదవ్, కృష్ణ, మగ్గిడి ప్రకాష్, జనార్ధన్, మూడు మండలాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రానున్న ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల ఎన్నికలు సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలేవైనా కాంగ్రెస్ విజయమే లక్ష్యంగా కలిసికట్టుగా పనిచేయాలని కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌ఛార్జి కంది శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆయన క్యాంపు కార్యాలయం ప్రజా సేవాభవన్‌లో నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణులతో సమావేశమయ్యారు. రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆదిలాబాద్ నియోజక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క ప్రత్యేక చొరవ తీసుకొని, మనకు నిధులు సమకూరుస్తుందన్నారు. కేవలం ఒక రోజు వ్యవధిలోనే వరుసగా రెండు సార్లు నిధులు నియోజకవర్గ అభివృద్ధికి రూ.14కోట్లు విడుదలయ్యాయన్నారు. పనుల కేటాయింపులో కూడా ఎవరికీ అన్యాయం జరగకుండా చూస్తామన్నారు. మనల్ని నమ్ముకుని వచ్చిన అందరికి మంచి జరగాలన్నారు. గత ప్రభుత్వ కుటుంబ పాలన అంతమై ప్రజాపాలన కొనసాగుతున్న తీరును తెలుపాలన్నారు. ఎన్నికలేవైనా ఆదిలాబాద్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగిరేలా ప్రతీ నాయకుడు, కార్యకర్త కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ నియోజకవర్గంలోని ముఖ్యనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్యుల భర్తీకి వాక్‌ఇన్ ఇంటర్వ్యూలు

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టుల కోసం నవంబర్ 5న వాక్‌ఇన్ ఇంటర్వ్యూలు ఉన్నాయని డీసీహెచ్ఎస్ డాక్టర్ సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్ అసిస్టెంట్ సర్జన్ విభాగంలో అనాస్థీషియా-2, గైనకాలజిస్ట్-2, పీడియాట్రీషియన్-2, ఈఎన్‌టీ-1, రేడియాలజిస్ట్-1, జనరల్ సర్జన్స్-3, జనరల్ మెడిసిన్-2, సివిల్ అసిస్టెంట్ సర్జన్స్ జీడీఎంఓస్-2 పోస్టులను ఒప్పంద పద్ధతిలో నియమించుటకు గాను అర్హత కలిగిన అభ్యర్థులు నుంచి దరఖాస్తును సంబంధిత సర్టిఫికేట్లు జతపరుస్తూ జిల్లా ఆస్పత్రుల పర్యవేక్షణ అధికారి కార్యాలయం, 1 టౌన్ పోలీస్ స్టేషన్ ఎదురుగా, నిర్మల్ జిల్లాలో నవంబర్ 5, ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల లోపు అందించాలని తెలిపారు. తదుపరి ఎంపిక ప్రక్రియను సాయంత్రం 4 గంటలలోపు అందజేసిన వారికి వాక్‌ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. అర్హులైన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికేట్లతో నిర్మల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో హాజరుకావాలని తెలిపారు.

శారీరక దృఢత్వానికి వ్యాయామం అవసరం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

శారీరక దృఢత్వానికి వ్యాయామం ఎంతో అవసరమని ఎంఎల్ఏ వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో జిమ్‌ను ప్రారంభించి మాట్లాడారు. కవి గురజాడ అప్పారావు తిండి కలిగితే..కండ కలదోయ్..కండ గలవాడేను మనిసోయ్..అన్నట్టుగా మనిషి ఆరోగ్యంగా, బలంగా ఉన్నప్పుడే ఏదైనా సాధించగలడని తెలిపారు. మండలంలో జిమ్ ఏర్పాటు చేయడం మంచి పరిణామమని తెలిపారు. దీన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. ఆయన వెంట ముఖాడే ఉత్తమ్, సోషల్ వర్కర్ అనిల్ రాథోడ్ ఉన్నారు.

ప్రజలు పోలీసులను మిత్రులుగా భావించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రజలు పోలీసులను ఒక మంచి మిత్రులుగా భావించాలని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పోలీస్ హెడ్ క్వార్టర్ సమావేశ మందిరంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి ఆన్‌లైన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీసుల విధులు, పోలీసుల ద్వారా వినియోగించబడుతున్న వివిధ రకాలైన ఆయుధాలు, వాటి మందు గుండు సామాగ్రి, ఆయుధాల పనితీరు, వాటి తయారీ, ఆయుధాలను తయారు చేసిన సంస్థ దేశాల పేర్లను విద్యార్థులకు వివరించారు. సాయుధ దళంలో పనిచేసే బాంబు స్క్వాడ్ బృందం విఐపీల సందర్శన సమయంలో, రోడ్డుకు ఇరువైపులా ప్రయాణించే దారి, కల్వర్టులు, హెలికాప్టర్ నిలుపు ప్రదేశాలు, బాంబులు తనిఖీ చేయడం, వినియోగించే పరికరాలు డీప్ సర్చ్ మెటల్ డిటెక్టర్, నాన్ లీనియర్ జంక్షన్ డిటెక్టర్, హ్యాండ్ హెల్డ్ మెటల్ డిటెక్టర్, ఒకే డిటెక్టర్ లాంటి వాటి పని విధానాలను వివరించారు. డాగ్ స్క్వాడ్ బృందంచే వివిధ రకాలైన జాతుల జాగిలాలు, వాటి పనితనం, చేసే విధులు అనగా మాదకద్రవ్యాలను కనుగొనడంలో, బాంబులను మందు గుండు సామాగ్రి జిలెటిన్ స్టిక్స్ లాంటి వాటిని కనుగొనడంలో, కీలకంగా నేర స్థలంలో నేరస్తులను వాసన పసిగట్టి కనుగొనే విధానాన్ని, పోలీసు జాగిలాల నైపుణ్యతను విద్యార్థులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు వినియోగిస్తున్న వివిధ రకాలైన పద్ధతులను తెలియజేసి తల్లిదండ్రులకు బంధువులకు విద్యార్థులు అవగాహన కల్పించాలని సూచించారు. ఎలాంటి అత్యవసర సమయంలోనైనా డయల్ 100 లేదా సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1930కి సమాచారం అందించి సహాయాన్ని పొందవచ్చును సూచించారు. జిల్లాలో నూతనంగా ఏర్పాటు చేయబడిన డీడీఆర్ఎఫ్ బృందం చేయు విధులు, అత్యవసర సమయాలలో డీడీఆర్ఎస్ బృందం ఎలాంటి సహాయ సహకారాలు అందిస్తుందో వివరాలపై తెలియజేశారు. అత్యవసర సమయంలో ధన, ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లకుండా త్వరితగతిన స్పందించి జిల్లాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.సురేందర్‌రావు, డీఎస్పీలు బి.సురేందర్‌రెడ్డి, సైబర్ క్రైమ్ డీఎస్పీ హసీబుల్లా, సీఐ డీసీఆర్బి బి.ప్రసాద్, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్లు డి వెంకటి, టి.మురళి, చంద్రశేఖర్, కార్తీక్, కమ్యూనికేషన్ ఎస్సై బి.గణేష్, పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, రిజర్వ్ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ మోసాల పట్ల విసిగిపోయిన ప్రజలు

- మాజీ మంత్రి జోగు రామన్న
- విజయవంతమైన కేటీఆర్ సభ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



కాంగ్రెస్ ప్రభుత్వ మోసాల పట్ల ప్రజలు విసిగిపోయారని, హమీలపై నిలదీసేందుకు కేటీఆర్ నేతృత్వంలో నిర్వహించిన పోరుబాట సభ విజయవంతమైందని మాజీ మంత్రి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ హమీలతో మోసపోయిన అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి సభను జయప్రదం చేశారన్నారు. కేటఆర్ సభకు రాకుండా ప్రజలను అడ్డుకునేందుకు కాంగ్రెస్ నాయకులు విశ్వ ప్రయత్నాలు చేశారని ఆరోపించారు. ఒక దశలో కేటీఆర్ సభ రద్దయిందంటూ విషప్రచారం చేశారని ఆరోపించారు. సభను నీరుగార్చేందుకు ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా హమీలతో మోసపోయి కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి పట్ల ఆవేశంతో ఉన్న అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి సభను విజయవంతం చేశారన్నారు. ఇందుకోసం వారం రోజుల పాటు రాత్రింబవళ్లు పనిచేసిన పార్టీ శ్రేణులతో పాటు ప్రజలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు అజయ్, రోకండ్ల రమేష్, రౌతు మనోహర్, విజ్జగిరి నారాయణ, మెట్టు ప్రహ్లాద్, యాసం నర్సింగరావు, సాజీదోద్దీన్, మార్శెట్టి గోవర్ధన్, సేవ్వా జగదీష్, కుమ్ర రాజు, పరమేశ్వర్, బట్టు సతీష్, విఠల్‌గౌడ్ పాల్గొన్నారు.

కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-తలమడుగు



ఆసిఫాబాద్

ఆదిలాబాద్ పట్టణంలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీపై సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిష్టిబొమ్మను శుక్రవారం మండలంలోని సుంకిడి గ్రామంలో బీంపూర్, తాంసి, తలమడుగు మండలాల కాంగ్రెస్ నాయకులు కార్యకర్తల ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ కార్యక్రమంలో బోథ్ నియోజవర్గం ఇన్‌చార్జ్ ఆడే గజేందర్, డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, మాజీ జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు కళ్యాణం లక్ష్మి రాజేశ్వర్, శ్రీధర్‌రెడ్డి, నాయకులు అశోక్, కౌడాల నారాయణ, ప్రకాష్‌రావు, రమేష్, అన్నుపటేల్, సంతు, నరేష్, వెంకన్న, రమేష్‌రెడ్డి, బాబుకాన్, విలాస్, ప్రతాప్, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ : ఆదిలాబాద్ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ శ్రేణులు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద మండల అధ్యక్షుడు మసాడే చరణ్ ఆధ్వర్యంలో కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా నాయకులు రైతులను అడ్డం పెట్టుకొని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. పదేళ్ల వారి పాలనలో రైతు వ్యతిరేక విధానాలను అవలంబించిన నాయకులు ఇప్పుడు రైతులపై ప్రేమ ఒలకబోస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన పది నెలల్లోపే ఇచ్చిన హామీలను అమలు చేయడాన్ని జీర్ణించుకోలేక బీఆర్ఎస్ లేనిపోని ఆరోపణలు చేస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు వసంతరావు, గుండ శ్యామ్, గాధవేని మల్లేష్, ఖలీమ్, గోపాల్, ప్రకాష్ రావు, దత్తు, నారాయణ, అసద్ పాల్గొన్నారు.

బోథ్ : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సీఎం రేవంత్‌రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని శుక్రవారం మండల కేంద్రంతో పాటు సొనాలలోని కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ బొడ్డు గంగారెడ్డి మాట్లాడుతూ పది సంవత్సరాలలో ప్రజా అవసరాలను తీర్చకుండా బీఆర్ఎస్ నాయకుల జేబులు నింపడానికి పనిచేశారన్నారు. రైతులను రుణ ఊబిలోకి నెట్టేసి విద్యార్థి, నిరుద్యోగుల జీవితాన్ని పేపర్ లీకులతో నిర్దాక్షిణ్యంగా నడి రోడ్డుపై ఉంచి ఆదిలాబాద్ సభలో కేటీఆర్ మాట్లాడిన మాటలు దయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఇచ్చోడ : జిల్లా కేంద్రంలో గురువారం బీఆర్ఎస్ నిర్వహించిన సభలో కేటీఆర్ ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తూ, సీఎం రేవంత్‌రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యాలకు నిరసనగా శుక్రవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కలిసి కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షులు మహమూద్‌ఖాన్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా పాలనలో రైతుల అభివృద్ధికి రూ.2లక్షల రుణమాఫీ చేసిన, మిగతా వారికి కూడా త్వరలోనే రుణమాఫీ జరగబోతుంది అని తెలిసి కూడా, కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇష్టానుసారంగా విమర్శించడం సిగ్గుపడాల్సిన విషయమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కన్వీనర్ కళ్లెం నారాయణరెడ్డి, బోథ్ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు కొత్తూరి లక్ష్మణ్, పీఏసీఎస్ వైస్ చైర్మెన్ బద్దం పురుషోత్తంరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ అబ్దుల్ అజీమ్, బోథ్ నియోజకవర్గ మైనారిటీ అధ్యక్షులు ముస్తఫా, ఇచ్చోడ మైనారిటీ అధ్యక్షులు అబ్దుల్ రషీద్, మాజీ సర్పంచ్ షేక్ షబ్బీర్, కాంగ్రెస్ యూత్ నాయకులు క్రాంతి కిరణ్ పాల్గొన్నారు.

బేల : మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద కాంగ్రెస్ శ్రేణులు శుక్రవారం బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో రైతు పోరు గర్జనలో కేటీఆర్ సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా బేల మండల మాజీ జెడ్పీటీసీ రాందాస్ నాక్లే మాట్లాడుతూ తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపైన కేటీఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామని పేర్కొన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.లక్ష రుణమాఫీ చేస్తామని అన్నారు. రైతులకు తొమ్మిది సంవత్సరాలు మోసం చేసి, కేవలం ఎన్నికల సమయంలో ముప్పై శాతం రైతులకు మాత్రమే రుణమాఫీ చేసి మిగితా రైతుల విషయంలో చేతులెత్తేసిందని అన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన ఆరు నెలల్లోనే రూ.2లక్షల రైతు రుణమాఫీని డెబ్బై శాతం పూర్తి చేసిందని అన్నారు. దీంతో పాటు ఎన్నికల్లో ఇచ్చినటువంటి ఆరు గ్యారంటీలను కూడా అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వం దేనని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మెన్ విలాస్ పాటిల్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ వామన్ వాంఖడే, ఎస్టీ సెల్ మండలాధ్యక్షులు మడావి చంద్రకాంత్, మినక సుధామ్‌రెడ్డి, రమేష్, విపిన్ ఠాక్రే, సాగర్ పాల్గొన్నారు.